Janampower.in

TELTEL/2016/69862

# జనం పవర్

తెలుగు దినపత్రిక

JANAM POWER

| కరీంనగర్ | శుక్రవారం | 01.05.2026 | సంపుటి : 14 | సంచిక : 320 | పేజీలు: 10 వెల: 5/- |
|---|---|---|---|---|---|
| Karimnagar | Friday | 01.05.2026 | Valume : 14 | Issue : 320 | Pages : 10 Cost: 5/- |



Editor: BANDARI MARUTHI



## చట్టాలను మార్చండి

- 15 ఏళ్ల బాలిక గర్భవిచ్ఛిత్తి కేసులో సుప్రీం కీలక వ్యాఖ్యలు
- గర్భాన్ని తొలగించుకునేలా చట్ట సవరణ చేయాలని సూచన

4

అత్యాచార బాధితురాలైన 15 ఏళ్ల బాలిక గర్భవిచ్ఛిత్తి కేసులో సుప్రీంకోర్టు గురువారం అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేసింది.

## మా కొత్త ఆయుధంతో అమెరికాకు హార్ట్‌ఎటాకే

- అతిత్వరలో రహస్య అస్త్రాన్ని ప్రయోగిస్తాం
- అణు ఒప్పందం కుదిరే వరకు దిగ్బంధనం
- ఇరాన్ నేవీ కమాండర్ రేర్ అడ్మిరల్ షారమ్

4





### తెలంగాణ ప్రజలకు శుభవార్త

ఎల్ఆర్ఎస్ ఫీజులో 25 శాతం రాయితీ

- మే 1 నుంచి జూలై 31 వరకు భారీ డిస్కౌంట్
- అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ వేగవంతమే లక్ష్యం
- జీఓ విడుదల చేసిన మున్సిపల్ శాఖ..
- సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచన

2

# సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌తో జవాబుదారీతనం

- విద్యార్థులకు సకాలంలో పాఠ్య సామగ్రి అందాలి
- వస్తువుల నాణ్యత విషయంలో రాజీపడొద్దు
- ప్రతి విద్యార్థి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి
- సంక్షేమ శాఖలపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 30:** విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా సకాలంలో అందేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. దుస్తులు, నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి సకాలంలో అందితే విద్యార్థులు చదువుపై పూర్తి స్థాయిలో శ్రద్ధ చూపుతారని సీఎం అన్నారు. విద్యా శాఖతో పాటు బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలు, ఎస్సీ డెవలప్‌మెంట్ శాఖల పరిధిలోని విద్యా సంస్థల్లోని విద్యార్థులకు అందజేసే సామగ్రి సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌పై ముఖ్యమంత్రి గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. గతంలో ఏ శాఖకు ఆ శాఖ ప్రొక్యూర్‌మెంట్, సరఫరా చేపట్టడంతో ఏకరూపత లోపించడంతో పాటు అనేక అక్రమాలు చోటుచేసుకునేవని... వాటిని అరికట్టేందుకు సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని తీసుకువచ్చామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో దుస్తులు, నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ఇతర సామగ్రి సరఫరాకు సంబంధించి ఏ శాఖకు ఆ శాఖ చేపట్టడంతో అవకతవకలకు ఆస్కారం ఉండేదన్నారు. అటువంటి అవకతవకలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని సీఎం స్పష్టం చేశారు.

మిగతా 2 లో





## యువ పోలీసుల చేతుల్లోనే శాఖ ప్రతిష్ట

- వీడ్కోలు సన్మానంలో డీజీపీ శివధర్ రెడ్డి
- 'ఫ్రెండ్లీ పోలీసింగ్' అత్యంత ఆవశ్యకం
- కొత్త డీజీపీ సీవీ ఆనంద్‌కు అభినందనలు

3

యువ పోలీస్ అధికారులు విభాగం ప్రతిష్టను పెంచాలని, ప్రజలతో స్నేహపూర్వక సంబంధాలను కలిగి ఉండే 'ఫ్రెండ్లీ పోలీసింగ్' విధానానికి పెద్దపీట వేయాలని శివధర్ రెడ్డి సూచించారు. ప్రస్తుత సమాజంలో పౌరులకు ఈ విధానం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. సమష్టి కృషి వల్లే తాను ఈ స్థాయికి చేరుకున్నానని, తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ మరియు తన కుటుంబ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



2

### ప్రభుత్వ సలహాదారుగా వీహెచ్ నియామకం

రాష్ట్ర భద్రతా సలహాదారుగా మాజీ డీజీపీ శివధర్‌రెడ్డి నియామకం

## శ్రామిక వర్గానికి ఎప్పుడూ అండగా ఉన్నాం

- కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నాం
- మేడే శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్



.. వివరాలు 2లో

"రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సామగ్రిని సకాలంలో మరియు నాణ్యతతో అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యా శాఖతో పాటు బీసీ, మైనారిటీ, గిరిజన మరియు ఎస్సీ సంక్షేమ శాఖల పరిధిలోని విద్యార్థులకు అందజేసే వస్తువుల కొనుగోలుపై ఆయన గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. గతంలో వివిధ శాఖలు విడివిడిగా ప్రొక్యూర్‌మెంట్ చేపట్టడం వల్ల అనేక అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకునేవని, వాటిని అరికట్టి పారదర్శకతను పెంచేందుకే 'సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్' విధానాన్ని తీసుకువచ్చామని సీఎం తెలిపారు."

## తెలుగు రాష్ట్రాలకు చల్లటి కబురు



- తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు ద్రోణి
- తెలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం

2

## అర్హులందరికీ అక్రిడిటేషన్

- ప్రభుత్వానికి రెండో ఆలోచన లేదు
- నూతన జీవోలతో 46 వేల మందికి లబ్ధి
- 15 రోజుల్లో ప్రక్రియ పూర్తి
- సంస్థలు మారినా కార్డులు తొలగించం
- జర్నలిస్టులకు కార్డులు అందజేసిన మంత్రి పొంగులేటి

2






## ఏసీబీ వలలో అవినీతి తిమింగలాలు

- ఇద్దరు అధికారులు అరెస్ట్
- ఆస్తి పన్ను తగ్గింపునకు లంచం డిమాండ్ చేసిన మున్సిపల్ ఉద్యోగి
- పోడు భూముల వ్యవహారంలో పట్టుబడ్డ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్
- సంగారెడ్డి, కొత్తగూడెం జిల్లాల్లో ఏసీబీ దాడులు

3

## గుజరాత్ పోలీసుల అదుపులో మురుగన్ గ్యాంగ్

- ఫెర్టిలిటీ సెంటర్లలో సోదాలు
- ఏడాదిలోనే 25 మంది చిన్నారుల విక్రయం..
- దేశవ్యాప్తంగా నెట్‌వర్క్
- హైదరాబాద్‌కు చెందిన మురుగన్ కింగ్‌పిన్‌గా గుర్తింపు.. భార్యదీ మరో ముఠా!
- తమకు సంబంధం లేదని నోవా ఐవీఎఫ్ ఫర్టిలిటీ వివరణ





3



## 18 నెలల బాలుడికి లివర్ మార్పిడి

- ఉస్మానియా వైద్యులకు మంత్రి దామోదర అభినందన

2



# తెలంగాణ ప్రజలకు శుభవార్త

## ఎల్ఆర్ఎస్ ఫీజులో 25 శాతం రాయితీ

## మే 1 నుంచి జూలై 31 వరకు భారీ డిస్కౌంట్

**హైదరాబాద్, ఏప్రిల్30:** తెలంగాణ రాష్ట్రంలో అనుమతి లేని, అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్న సామాన్య ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. పెండింగ్‌లో ఉన్న లక్షలాది దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు వీలుగా, ఎల్ఆర్ఎస్ ఫీజు మరియు ఇతర చార్జీలపై ఏకంగా 25 శాతం రాయితీని ప్రకటిస్తూ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ జీఓ ఎంఎస్ నెం. 131ని విడుదల చేసింది. ప్రభుత్వం ప్రకటించిన ఈ రాయితీ పథకం మే 1వ తేదీ నుంచి ప్రారంభమై జూలై 31 వరకు, అంటే కేవలం మూడు నెలల పాటు మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఈ నిర్ణీత గడువులోగా తమ ఎల్ఆర్ఎస్ చార్జీలను చెల్లించే దరఖాస్తుదారులకు మాత్రమే ఈ 25 శాతం డిస్కౌంట్ వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. గత కొంతకాలంగా నిలిచిపోయిన ఈ ప్రక్రియను పూర్తి చేయడంలో ప్రజలకు ఆర్థిక వెసులుబాటు కల్పించాలనే ఉద్దేశంతో 'తెలంగాణ రెగ్యులరైజేషన్ ఆఫ్ అన్‌అప్రూవ్డ్ అండ్ ఇల్లీగల్ లేఅవుట్ రూల్స్-2020'కి సవరణలు చేస్తూ ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఈ ఉత్తర్వులను జారీ చేస్తూ, తదుపరి చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అక్రమ లేఅవుట్ల సమస్యకు ఈ రాయితీ ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని అధికారులు విశ్లేషిస్తున్నారు. తక్కువ ధరకే తమ భూములను చట్టబద్ధం చేసుకునే ఈ సువర్ణావకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# ప్రభుత్వ సలహాదారుగా వీహెచ్ నియామకం

## రాష్ట్ర భద్రతా సలహాదారుగా మాజీ డీజీపీ శివధర్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 30:** తెలంగాణ ప్రభుత్వం పరిపాలనలో కీలక మార్పులు చేస్తూ సలహాదారుల నియామకంపై కీలక నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి. హనుమంతరావు (వీహెచ్)ను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదవికి సంబంధించి ఆయనకు క్యాబినెట్ హోదాను కూడా కల్పించింది. దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న వీహెచ్ సేవలను ప్రభుత్వ పరంగా వినియోగించుకోవాలని సర్కార్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, రాష్ట్ర భద్రతా వ్యవహారాల కోసం ప్రత్యేకంగా భద్రతా సలహాదారును ప్రభుత్వం నియమించింది. ఇటీవలే డీజీపీగా పదవీ విరమణ చేసిన బత్తుల శివధర్‌రెడ్డిని రాష్ట్ర భద్రతా సలహాదారుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. పోలీస్ విభాగంలో వివిధ హోదాల్లో పనిచేసిన ఆయన అనుభవం, రాష్ట్ర భద్రతా వ్యూహాల రచనలో కీలకంగా మారనుంది. కీలకమైన ఈ రెండు నియామకాలతో రాష్ట్ర ప్రభుత్వ పాలనా యంత్రాంగంలో మరింత వేగం పెరగనుంది.

# అర్హులందరికీ అక్రిడిటేషన్ కార్డులు

## జర్నలిస్టులకు కార్డులు అందజేసిన మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, ఏప్రిల్30:** రాష్ట్రంలోని జర్నలిస్టులు ఎంతో కాలంగా నిరీక్షిస్తున్న కొత్త అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించింది. గురువారం హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జర్నలిస్టులకు స్వయంగా కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు అందజేస్తామని, ఈ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని స్పష్టం చేశారు. కార్డు పొందిన తర్వాత ఎవరైనా సంస్థ మారినట్లయితే, ఆ సమాచారాన్ని అధికారులకు తెలియజేస్తే వారి కార్డులను తొలగించబోమని ఆయన హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో అక్రిడిటేషన్ల సంఖ్య కేవలం 32 వేల నుంచి 35 వేల మధ్య ఉండేదని, తమ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన నిబంధనల వల్ల సుమారు 46 వేల మంది జర్నలిస్టులకు లబ్ధి చేకూరుతుందని మంత్రి వివరించారు. ఇప్పటికే రాష్ట్ర స్థాయి కార్డులకు సంబంధించి 2500 మందికి క్లియరెన్స్ ఇచ్చామని, జిల్లా స్థాయి కార్డుల మంజూరుపై కూడా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. రాబోయే 15 రోజుల్లో అర్హులందరికీ కార్డుల మంజూరు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన ప్రకటించారు. కొత్త దరఖాస్తుల స్వీకరణకు ఒక నిర్ణీత గడువు ఉండాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. జర్నలిస్టుల ఖచ్చితమైన సంఖ్య తెలిస్తే, దాని ఆధారంగా వారి కోసం మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని పేర్కొన్నారు. పాత కార్డుల గడువు ముగియడంతో, యుద్ధ ప్రాతిపదికన కొత్త కార్డుల జారీని పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొంగులేటి పునరుద్ఘాటించారు.

# 18 నెలల బాలుడికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్

## ఉస్మానియా వైద్యులకు మంత్రి దామోదర అభినందన



**హైదరాబాద్, ఏప్రిల్ 30:** ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లో అరుదైన లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరిగింది. గ్లైకోజెన్ స్టోరేజ్ సమస్యతో బాధపడుతున్న 18 నెలల బాలుడికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను ఉస్మానియా వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. 10 కిలోల బరువున్న బాబుకి లివర్ మార్పిడి చేశారు. తండ్రి లివర్ నుంచి కొంత భాగాన్ని సేకరించి చిన్నారికి అమర్చారు. 14 గంటల పాటు క్లిష్ట శస్త్రచికిత్స కొనసాగింది. శస్త్రచికిత్స అనంతరం చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం కింద పూర్తిగా ఉచితంగా డాక్టర్లు చికిత్స అందజేశారు. దేశంలో ప్రభుత్వ రంగంలో ఇలాంటి శస్త్రచికిత్సలు అత్యంత అరుదని డాక్టర్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఉస్మానియా వైద్యుల బృందాన్ని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందించారు.

# సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌తో జవాబుదారీతనం

మొదటి పేజీ తరువాయి

సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానంతో జవాబుదారీతనం పెరుగుతుందని సీఎం అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రయత్నం చేస్తుందని... సరఫరాదారుల ప్రయోజనాలు కాపాడేందుకు కాదన్నారు. విద్యార్థులకు అందజేసే నోటు పుస్తకాలు, ట్రంక్ పె÷-టటెలు, ప్లేట్లు, గ్లాసులు, ట్రాక్ షూట్లు, బెడ్ షీట్లు, స్కూల్ బ్యాగ్లు, ఐడీ కార్డులు, యూనిఫాంలు అన్నీ నాణ్యమైనవే ఉండాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నాణ్యతతో పాటు సకాలంలో అందడంపైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జూన్ 15 నాటికి విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా అందాలని, అలా అందగానే సరఫరాదారులకు చెల్లింపులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. విద్యార్థులకు అందజేసే వస్తువులకు సంబంధించి మండల స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. అక్కడి నుంచి క్షేత్ర స్థాయిలో గ్రామాల్లోని



పాఠశాలలు, హాస్టళ్లకు వస్తువులు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని, సరఫరాకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీయించాలన్నారు. ప్రతి విద్యార్థికి వారికి అవసరమైన సామగ్రి అంతా అందిందా లేదా అనే దానిని చెక్ చేసుకోవాలని సీఎం ఆదేశించారు. నోటు పుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రి క్వాలిటీ... వాటిని అందుకున్న తర్వాత వారి భావాలను తెలియజేసేందుకు విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సీఎం సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విద్యాశాఖల మధ్య సమన్వయానికి ఒక కమిటీని నియమించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాల మాయాదేవి, సెర్ప్ సీఈవో దివ్య, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి సంతోష్, బిసి కార్యదర్శి బి.సైదులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రామిక వర్గానికి ఎప్పుడూ అండగా ఉన్నాం

## కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నాం

## మేడే శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్

**హైదరాబాద్, ఏప్రిల్ 30 :** మే డే సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి కార్మిక వర్గానికి ప్రత్యేకంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రభుత్వ పాలనలో కార్మిక వర్గ స్ఫూర్తితో ముందుకు వెళుతున్నట్టు పేర్కొన్నారు. తమ ప్రభుత్వ పాలనలో కార్మికులకు సముచిత గౌరవం లభిస్తుందని స్పష్టం చేశారు. శ్రామికులే తమ ప్రభుత్వ అభివృద్ధిలో అసలైన భాగస్వాములని.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే నూతన పారిశ్రామిక విధానం శ్రామికుల అభ్యున్నతికి దోహదపడుతుందని చెప్పారు. కార్మికుల శ్రేయస్సు, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. మే డే స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే




అసంఘటిత రంగంలో పని చేస్తున్న గిగ్ వర్కర్ల కోసం రూ. 5 లక్షల ప్రమాద బీమా అమలు చేశామన్నారు. తెలంగాణ గిగ్, ప్లాట్ ఫాం వర్కర్స్ సంక్షేమ బిల్లు తీసుకువచ్చినట్టు తెలిపారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తున్నదని సీఎం పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖల్లో పెండింగ్ లో ఉన్న కారుణ్య నియామకాలను భర్తీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ దేశానికే తలమానికంగా ఉన్న సింగరేణి కార్మికులకు, దసరా, దీపావళి పండుగలకు ముందే బోనస్ చెల్లించడం జరిగిందన్నారు. సింగరేణి చరిత్రలో తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకు రూ. 5 వేలు చొప్పున బోనస్ ఇచ్చినట్టు గుర్తు చేశారు. దాంతోపాటు, పలు బ్యాంకుల సహకారంతో కార్మికులకు కోటి రూపాయల బీమా సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించినట్టు వివరించారు. గల్ఫ్ దేశాల్లో పని చేసే తెలంగాణ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. తెలంగాణ కార్మికులు ఆయా దేశాల్లో ఏ కారణంతో మరణించినా.. వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించడం జరుగుతుందన్నారు.

# యువ పోలీసుల చేతుల్లోనే శాఖ ప్రతిష్ట

- వీడ్కోలు సన్మానంలో డీజీపీ శివధర్ రెడ్డి
- ప్రజలకు చేరువయ్యేలా 'ఫ్రెండ్లీ పోలీసింగ్' అత్యంత ఆవశ్యకం
- కొత్త డీజీపీ సీవీ ఆనంద్‌కు అభినందనలు

**హైదరాబాద్, ఏప్రిల్30:** రాష్ట్ర డీజీపీ బీ శివధర్ రెడ్డికి తెలంగాణ పోలీస్ అకాడమీలో పోలీస్ అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. గురువారం ఆయన పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన 32 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో మధురమైన అనుభూతులు, అనుభవాలు ఉన్నాయని గుర్తు చేసుకున్నారు. వృత్తిలో భాగంగా అనేక సంస్కరణలు ప్రవేశపెట్టామని, నేడు పోలీసింగ్ విధానంలో ఎన్నో మార్పులు వచ్చాయని ఆయన అభిప్రాయపడ్డారు. యువ పోలీస్ అధికారులు విభాగం ప్రతిష్టను పెంచాలని, ప్రజలతో స్నేహపూర్వక సంబంధాలను కలిగి ఉండే 'ఫ్రెండ్లీ పోలీసింగ్' విధానానికి పెద్దపీట వేయాలని శివధర్ రెడ్డి సూచించారు. ప్రస్తుత సమాజంలో పౌరులకు ఈ విధానం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. సమష్టి కృషి వల్లే తాను ఈ స్థాయికి చేరుకున్నానని, తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ మరియు తన కుటుంబ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తనను డీజీపీగా నియమించిన సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ, తన గురువులను కూడా స్మరించుకున్నారు.



## కొత్త డీజీపీ సీవీ ఆనంద్ ప్రశంసలు


నూతన డీజీపీగా బాధ్యతలు చేపట్టనున్న సీవీ ఆనంద్‌కు శివధర్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ మాట్లాడుతూ, శివధర్ రెడ్డి తన సర్వీసులో ఎన్నో సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారని ప్రశంసించారు. 1970, 1980 నాటి పరిస్థితులకు, ఇప్పటి పోలీసింగ్‌కు చాలా వ్యత్యాసం ఉందని, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా శాఖను సిద్ధం చేశామని ఆయన పేర్కొన్నారు. శివధర్ రెడ్డి వంటి అనుభవజ్ఞుల సలహాలు, సూచనలు తీసుకునేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని సీవీ ఆనంద్ ఈ సందర్భంగా వెల్లడించారు.

# తెలుగు రాష్ట్రాలకు చల్లటి కబురు

- తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు ద్రోణి
- తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం



**హైదరాబాద్ /అమరావతి, ఏప్రిల్ 30:** తెలుగు రాష్ట్రాల్లో ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో వాతావరణ శాఖ ఉపశమనం కలిగించే వార్త చెప్పింది. ద్రోణి ప్రభావంతో అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వచ్చే మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈదురు గాలులు సహా పిడుగులతో కూడిన జల్లులు కురుస్తాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం.. దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో ద్రోణి విస్తరించి ఉంది. ఫలితంగా.. ఏపీలోని దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో మూడు రోజుల పాటు అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశముంది. గురువారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా పిడుగులతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే ఛాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో గంటకు 50- 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముంది. శుక్ర, శనివారాల్లో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవడం సహా గంటకు సుమారు 40 - 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ఛాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో వేడి, తేమ సహా అసౌకర్యమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడనున్నట్టు సమాచారం. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకారం.. ద్రోణి/వాయు అస్థిరత ఇప్పుడు దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో విస్తరించి ఉంది.



అంతర్గత మహారాష్ట్ర సహా దానిని ఆనుకుని ఉన్న తెలంగాణపై సముద్ర మట్టానికి 3.1 కి.మీ. ఎత్తులో ఒక ప్రతిచక్రవాత వలయం ఏర్పడింది. దీంతో రానున్న మూడు రోజుల్లో కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలో రానున్న మూడు రోజులలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు దాదాపు ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉంది. ఇదిలావుంటే తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. హైదరాబాద్, వరంగల్, ఆదిలాబాద్, విశాఖ, విజయవాడ, నెల్లూరు వంటి ప్రాంతాల్లో ఎండలు దంచికొడుతున్నాయి. తెలంగాణలో వడదెబ్బ మృతుల సంఖ్య పెరిగిపోతోంది. పగలంతా ఎండ కొడుతుండగా.. సాయంత్రం మాత్రం అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయి. మరోవైపు గురు, శుక్రవారాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. ఏపీలోనూ పిడుగులతో కూడిన వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయని అధికారులు తెలిపారు.

# గుజరాత్ పోలీసుల అదుపులో మురుగన్ గ్యాంగ్




- ఫెర్టిలిటీ సెంటర్లలో సోదాలు
- ఏడాదిలోనే 25 మంది చిన్నారుల విక్రయం..
- దేశవ్యాప్తంగా నెట్‌వర్క్
- హైదరాబాద్‌కు చెందిన మురుగన్ కింగ్‌పిన్‌గా గుర్తింపు.. భార్యదీ మరో ముఠా!
- తమకు సంబంధం లేదని నోవా ఐవీఎఫ్ ఫర్టిలిటీ వివరణ

**హైదరాబాద్:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన చిన్నారుల అక్రమ రవాణా కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. చైల్డ్ ట్రాఫికింగ్‌లో కింగ్‌పిన్‌గా భావిస్తున్న మురుగన్ గ్యాంగ్‌ను గుజరాత్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ గ్యాంగ్ అందించిన సమాచారం మేరకు మూడు ఫెర్టిలిటీ సెంటర్లలో పోలీసులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. గత ఏడాది వరకు ఆదిలాబాద్‌లోని ఇటుక బట్టీలో పనిచేసిన మురుగన్, కేవలం ఒక్క ఏడాది కాలంలోనే దేశవ్యాప్త నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుని చైల్డ్ ట్రాఫికింగ్‌లో కింగ్‌పిన్‌గా ఎదగడం పోలీసులను విస్మయానికి గురిచేస్తోంది. మురుగన్ గత చరిత్రను పరిశీలిస్తే, గత ఏడాది చైతన్యపురి కేసులో ఇతని పేరు మొదటిసారి వెలుగులోకి వచ్చింది. మూడు నెలల పాటు జైలు శిక్ష అనుభవించి జూలైలో విడుదలైన తర్వాత, మురుగన్ తన కార్యకలాపాలను దేశవ్యాప్తంగా విస్తరించాడు. కేవలం ఒక్క ఏడాదిలోనే ఈ ముఠా సుమారు 25 మంది చిన్నారులను విక్రయించినట్లు విచారణలో వెల్లడైంది. మురుగన్ భార్య కృష్ణవేణి కూడా మరో ప్రత్యేక గ్యాంగ్‌ను నడుపుతున్నట్లు గుజరాత్ పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని గుజరాత్‌కు తరలిస్తున్నారు.

### నోవా ఐవీఎఫ్ ఫర్టిలిటీ క్లారిటీ:

ఈ కేసులో తమ సంస్థపై జరుగుతున్న ప్రచారంపై హైదరాబాద్‌లోని ప్రముఖ 'నోవా ఐవీఎఫ్ ఫర్టిలిటీ' యాజమాన్యం స్పందించింది. మురుగన్ గ్యాంగ్‌కు తమకు ఎలాంటి సంబంధం లేదని, గుజరాత్ పోలీసులు తమ సెంటర్లలో ఎటువంటి తనిఖీలు నిర్వహించలేదని వారు స్పష్టం చేశారు. తాము అన్ని క్లినికల్, లీగల్ మరియు ఎథికల్ ప్రమాణాలకు అనుగుణంగానే సేవలు అందిస్తున్నామని తెలిపారు. సోషల్ మీడియాలో తమపై జరుగుతున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని, రోగులకు ఉత్తమ వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని నిర్వాహకులు వివరణ ఇచ్చారు.

# త్వరలో ట్రైబల్ వర్సిటీ క్యాంపస్ నిర్మాణం

### రూ.7,823 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలు

### ప్రధాని పర్యటనపై కిషన్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, ఏప్రిల్ 30:** సమ్మక్క- సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. మే 10న హైదరాబాద్ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ.. రూ.7,823 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తారని చెప్పారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో కేంద్రమంత్రి ఈమేరకు మీడియాతో మాట్లాడారు. 'హైదరాబాద్‌లో పెట్రోలియం ఉత్పత్తులకు సంబంధించి టెర్మినల్‌ను ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. మహబూబ్‌నగర్‌లో రూ.3,175 కోట్ల విలువైన జాతీయ రహదారి పనులకు వర్చువల్‌గా శ్రీకారం చుట్టనున్నారు. హఫీజ్‌పేట, జోగులాంబ రైల్వేస్టేషన్లను, కాజీపేట-విజయవాడ మధ్య మూడో రైల్వే లైన్‌ను ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో రూ.85 వేల కోట్ల రైల్వే ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. హైదరాబాద్-యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్ పనులు ప్రారంభమయ్యాయి. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నాం. 2030 నాటికి రూ.9 లక్షల కోట్ల విలువైన టెక్స్‌టైల్ ఉత్పత్తులను ఎగుమతి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం అని కిషన్‌రెడ్డి తెలిపారు.

# రాష్ట్రంలో పెరుగుతున్న ఎండల తీవ్రత

### భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్

### అధికారులతో సమీక్షించిన డిప్యూటి సిఎం భట్టి

**హైదరాబాద్, ఏప్రిల్ 30:** రాష్ట్రంలో ఎండల తీవ్రత దృష్ట్యా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజాభవన్‌లో విద్యుత్ సరఫరా పై ఇంధన శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో భానుడి భగభగలకు తోడు ఇళ్లు, కార్యాలయాల్లో ఏసీలు, కూలర్ల వాడకం విపరీతంగా పెరిగిందని అధికారులు మంత్రికి వివరించారు. దీనికి వ్యవసాయ అవసరాలు కూడా తోడవడంతో గ్రిడ్‌పై ఒత్తిడి పెరుగుతోందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా విద్యుత్ మార్కెట్‌పై ఒత్తిడి ఉన్నప్పటికీ, రాష్ట్ర అవసరాలకు ఏమాత్రం లోటు రాకుండా పవర్ ఎక్స్ఛేంజీల ద్వారా అదనపు విద్యుత్ కొనుగోళ్లు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆసుపత్రులు, తాగునీటి సరఫరా పథకాలు మరియు అత్యవసర సేవలకు విద్యుత్ అంతరాయం కలగకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, జల విద్యుత్ ఉత్పత్తిని సమర్థంగా నిర్వహించాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున, అన్ని విద్యుత్ సంస్థలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వివరించారు. రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ స్థిరంగా ఉందని, ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు తగిన ఏర్పాట్లు చేశామని అధికారులు మంత్రికి హామీ ఇచ్చారు. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని, అన్ని వర్గాల వినియోగదారులకు నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరాను కొనసాగించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ అగ్ర ప్రాధాన్యమని స్పష్టం చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, క్షేత్రస్థాయి సిబ్బందిని నిరంతరం అప్రమత్తంగా ఉంచాలని ఆదేశించారు.

# చిన్నారిని మింగిన మిషన్ భగీరథ గుంత

### పూడ్చకుండా ఉంచడంతో గుంతలో పడ్డ ఐదేళ్ల మోక్షిత

### అధికారుల తీరుపై గ్రామస్థుల ఆందోళన



**జనగామ, ఏప్రిల్ 30:** జిల్లాలోని బచ్చన్నపేట మండలం ఆలీంపూర్ గ్రామంలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. అధికారుల నిర్లక్ష్యం ఒక పసి ప్రాణాన్ని బలితీసుకుంది. మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మత్తుల కోసం తవ్విన గుంతను అలాగే వదిలేయడంతో, ప్రమాదవశాత్తు అందులో పడి మోక్షిత అనే ఐదేళ్ల చిన్నారి మృతి చెందింది. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం అలుముకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఆలీంపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఎదుట మిషన్ భగీరథ పైపులైన్ లీక్ కావడంతో, సుమారు 20 రోజుల క్రితం అధికారులు మరమ్మత్తుల కోసం 4 మీటర్ల లోతున భారీ గుంతను తవ్వారు. అయితే, మరమ్మత్తులు పూర్తయినా లేదా మధ్యలో నిలిచిపోయినా, ఆ గుంతను పూడ్చకుండా అధికారులు అలాగే వదిలేశారు. గత మూడు వారాలుగా ఆ మృత్యు గుంత పాఠశాల ముందే దర్శనమిస్తున్నా, ఏ ఒక్క అధికారి కూడా దాని భద్రత గురించి పట్టించుకోలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలీంపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో కవిత అనే మహిళ ఆయాగా పనిచేస్తోంది. ఆమె తన ఇద్దరు కుమార్తెలు దక్షిత , మోక్షితలను వెంటబెట్టుకుని పాఠశాలకు వచ్చింది. తల్లి లోపలికి వెళ్లిన క్రమంలో, ఆడుకుంటూ వెళ్లిన మోక్షిత ప్రమాదవశాత్తు ఆ గుంతలో పడిపోయింది. పక్కనే ఉన్న అక్క దక్షిత ఈ విషయాన్ని వెంటనే తల్లికి చెప్పడంతో, కవిత పరుగులు తీస్తూ వచ్చి తన చిన్నారిని కాపాడుకునేందుకు గుంతలోకి దూకింది. కవితతో పాటు దక్షిత కూడా గుంతలోకి దూకింది. గుంతలో మునిగిపోతున్న వారిని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి ముగ్గురినీ బయటకు తీశారు. అయితే, అప్పటికే జరగరాని నష్టం జరిగిపోయింది. తల్లి కవిత, అక్క దక్షిత ప్రాణాలతో బయటపడినప్పటికీ, ఐదేళ్ల మోక్షిత అప్పటికే మృతి చెందింది. అల్లారుముద్దుగా పెంచుకున్న బిడ్డ తన కళ్లముందే విగతజీవిగా పడి ఉండటంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మిషన్ భగీరథ అధికారుల బాధ్యతారాహిత్యం వల్లే మోక్షిత ప్రాణాలు కోల్పోయిందని ఆగ్రహించిన బంధువులు, గ్రామస్తులు చిన్నారి మృతదేహంతో ఆందోళనకు దిగారు. స్కూల్ ఎదుటే అంత లోతైన గుంతను 20 రోజుల పాటు పూడ్చకుండా వదిలేయడం అధికారుల నేరపూరిత నిర్లక్ష్యమేనని వారు మండిపడుతున్నారు. తక్షణమే బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని , బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనతో ఆలీంపూర్ గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది.




# కవిత పార్టీ పేరు తెలంగాణ రక్షణ సేన

### ఆమోదించిన కేంద్ర ఎన్నికల సంఘం

### టీఆర్ఎస్ రాసిపెట్టి ఉందంటూ కవిత పోస్ట్

**హైదరాబాద్, ఏప్రిల్ 30:** 'తెలంగాణ రక్షణ సేన' పేరును కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదించింది. ఆమె పెట్టుకున్న పేర్ల ఆధారంగా ఈ పేరును ఖరారు చేసింది. దీనిపై కవిత హర్షం వ్యక్తం చేశారు. 'ఈసీ నిబంధనలకు అనుగుణంగా జనవరిలో మొత్తం ఐదు పేర్లతో దరఖాస్తు చేసుకున్నాం. మూడో ప్రాధాన్యంగా ఇచ్చిన పేరును ఈసీ ఆమోదించింది. టీఆర్ఎస్.. నాకు రాసిపెట్టి ఉందేమో! రెండు దశాబ్దాలుగా తెలంగాణ సాంస్కృతిక పరిరక్షణ, పునరుజ్జీవం కోసం చేస్తున్న కృషిని కొనసాగిస్తా. రాష్ట్ర అస్తిత్వ పరిరక్షణెళి ధ్యేయంగా అంకితభావంతో పనిచేస్తా' అని కవిత 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ఈ నెల 25న కవిత ప్రకటించిన రాజకీయ పార్టీ 'టీఆర్ఎస్'కు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదముద్ర వేసిన విషయం తెలిసిందే. తెలంగాణ రాష్ట్ర సేన బదులు 'తెలంగాణ రక్షణ సేన' పేరును ఆమోదించింది. టీఆర్ఎస్ పార్టీకి అనుమతిస్తూ బంజారాహిల్స్‌లోని కవిత నివాసంలో ఎన్నికల సంఘం అధికారులు ఆమెకు లేఖ అందజేశారు. పార్టీ పేరుపై పత్రికల్లో ప్రకటన ఇవ్వాలని కవితకు ఈసీ సూచించింది. అదేవిధంగా కొత్త పార్టీ పేరుపై అభ్యంతరాలుంటే 30 రోజుల్లోపు తమ దృష్టికి తీసుకురావాలని తెలిపింది.

# ఏసీబీ వలలో అవినీతి తిమింగలాలు

### ఇద్దరు అధికారులు అరెస్ట్

### ఆస్తి పన్ను తగ్గింపునకు లంచం డిమాండ్ చేసిన మున్సిపల్ ఉద్యోగి


### పోడు భూముల వ్యవహారంలో పట్టుబడ్డ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్

### సంగారెడ్డి, కొత్తగూడెం జిల్లాల్లో ఏసీబీ దాడులు



**సంగారెడ్డి/భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 30:** రాష్ట్రంలో అవినీతి అధికారుల వేట కొనసాగుతోంది. వేర్వేరు జిల్లాల్లో లంచం తీసుకుంటూ మున్సిపల్ మరియు అటవీ శాఖకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మున్సిపల్ కార్యాలయంలో ఒక కాంట్రాక్ట్ ఉద్యోగి ఏసీబీకి చిక్కాడు. ఆస్తి పన్ను తగ్గించేందుకు బిల్లు కలెక్టర్‌గా వ్యవహరిస్తున్న నిఖిల్ రెడ్డి అనే వ్యక్తి ఒక బాధితుడి నుంచి రూ. 35 వేలు డిమాండ్ చేశాడు. ఇందులో భాగంగా ఇప్పటికే రూ. 20 వేలు వసూలు చేయగా, మిగిలిన రూ. 15 వేల కోసం బాధితుడిపై ఒత్తిడి పెంచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ నేతృత్వంలో అధికారులు వ్యూహం పన్ని, గురువారం బాధితుడి నుంచి రూ. 15 వేలు తీసుకుంటుండగా నిఖిల్ రెడ్డిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మున్సిపల్ కార్యాలయంలో సుమారు 4 గంటల పాటు సోదాలు నిర్వహించిన అనంతరం నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. మరో ఘటనలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని నడిమిగూడెం బీట్ అధికారి బానోత్ నరేష్ ఏసీబీ అధికారులకు చిక్కాడు. బాధితుడి తండ్రికి ప్రభుత్వం కేటాయించిన 5 ఎకరాల పోడు భూముల్లో అటవీ శాఖ అధికారులు జోక్యం చేసుకోవద్దని కోరగా, ఇందుకు ప్రతిగా బీట్ అధికారి లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించగా, గురువారం రూ. 10 వేలు లంచం తీసుకుంటుండగా అధికారులు అతడిని పట్టుకున్నారు. నిందితుడిని వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపరిచినట్లు అధికారులు వెల్లడించారు.

# పిల్లల దత్తతలో జాగ్రత్తలు తీసుకోవాలి



**హైదరాబాద్, ఏప్రిల్ 30 :** పిల్లల దత్తత విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా వ్యవహరించాలని తెలంగాణ రాష్ట్ర శిశు, సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. దత్తత కావాలనుకున్న వారు ఐసీడీసీని సంప్రదించాలని సూచించారు. శుక్రవారం కాచిగూడ బస్ టెర్మినల్‌లో అమ్మఒడి తల్లిపాల ఫీడింగ్ కేంద్రాన్ని, కాచిగూడ రైల్వేస్టేషన్‌లో పిల్లల దత్తత కేంద్రాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో కలిసి మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడారు. సమ్మక్క – సారలమ్మ జాతరలో పిల్లల తల్లులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో, జన సమూహ ప్రాంతాల్లో, బస్సు టెర్మినల్, రైల్వేస్టేషన్, బస్టాండ్‌లలో తల్లిపాల ఫీడింగ్ కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక, శిశు, సంక్షేమ శాఖ అధికారులు, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## సంపాదకీయం

# శ్రమదోపిడీని ప్రోత్సహిస్తున్న పాలకులు!

శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది ఏదీ లేదని మహాకవి శ్రీశ్రీ అన్నారు. కార్మిక లోకాన్ని తట్టి లేపిన విప్లవకారుడు శ్రీశ్రీ. అయితే దేశంలో ఐటి విప్లవం వచ్చిన తరవాత పాలకులు కార్మికులను పట్టించుకోవడం మానేశారు. నేటికీ వారి బతుకులు ఛిద్రం అవుతున్నా కనీసం పలకరింపులు, సానుభూతి వచనాలు లేవు. ఇప్పుడు కార్మికులంటే కేవలం కర్మాగారాల్లో పనిచేస్తున్నవారే కాదు. రోడ్డుమీద పడి పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ కార్మికులే. వారికి ముఖ్యంగా ఆరోగ్య, ఆర్థిక భద్రత లేదు. ఆకాశ హర్మ్యాలను కడుతున్నా.. కుటుంబానికి దూరంగా ఉడిగం చేస్తున్నా కూలీ తప్ప పెద్దగా ప్రయోజనాలు కలగడం లేదు. వీరందరికీ ప్రధానంగా ఆరోగ్య వసతి, పెన్షన్ పథకాలు కలగాలి. పనిచేసే ప్రతి ఒక్కరినీ కార్మికులుగా చూడాలి. వారికి విద్య,ఆరోగ్య, పెన్షన్ భద్రత వంటి కనీస సౌకర్యాలు కలగాలి. అలాగే అసంఘటిత కార్మికులను ఆదుకునే ప్రయత్నాలు చేయాలి. పాలకులంతా ఎసి కార్లలో, విమానాల్లో తిరుగుతూ.. ఎసి బంగలాల్లో నివస్తున్నారు. వీరికి సామాన్యుల కష్టాలు తెలియడం లేదు. ప్రజలు కట్టిన పన్నులతో జల్సాలు చేస్తున్నారు. సమాజ గతిని, పురోగతిని శాసించేది, నిర్దేశించేది శ్రామిక వర్గమే. ఆ శ్రమే వెట్టిచాకిరికి గురవుతోంది. శ్రామికుడు దోపిడీకి గురవుఉతన్నాడు. పరిస్థితులు ఇలాగే ఉంటే.. కష్టించి పని చేసే చేతులు పిడికిళ్లు బిగిస్తాయని గుర్తించాలి. ఉద్యమాలు పుట్టుకొస్తాయి. కార్మిక దినోత్సవ ఆవిర్భావాన్ని ఏ ఒక్క దేశానికో, సంఘటనకో ముడిపెట్టలేం. కానీ 1886లో షికాగోలోని హే మార్కెట్‌లో జరిగిన కార్మికుల ప్రదర్శనే ఈ మే డే పుట్టుకకు పునాది వేసిందని చెబుతారు. కానీ ఆ ప్రదర్శన ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో కొందరు కార్మికులు చనిపోయారు. ఆ సంఘటన అనంతరం 1889 నుంచి 1890 వరకు అనేక దేశాల్లో కార్మికుల ఉద్యమాలూ, నిరసన ప్రదర్శనలూ చోటుచేసుకున్నాయి. షికాగోలో జరిగిన కార్మిక ప్రదర్శనలో చనిపోయిన వారికి గుర్తుగా మే 1ని కార్మిక దినోత్సవంగా జరుపుకోవాలన్న ఒప్పందం కూడా కుదిరింది. భారతదేశంలో చాలా ఆలస్యంగా కార్మిక దినోత్సవాన్ని జరుపుకున్నాము. 1923 మే 1వ తేదీన మద్రాసులో లేబర్ కిసాన్ పార్టీ ఆధ్వర్యంలో తొలిసారి ఈ వేడుకలను జరుపుకున్నారు. రెండో ప్రపంచ యుద్ధం తరవాత ఐరోపా దేశాల్లో మే 1వ తేదీని సెలవు దినంగా పాటించడం మొదలు పెట్టారు. అనంతరం అనేక దేశాలు ఇదే బాటలో నడిచాయి. చాలా దేశాల్లో కార్మికులకు సంబంధించిన అనేక సంక్షేమ పథకాలు ఆ రోజునే అమల్లోకి వచ్చాయి. కార్మిక దినోత్సవం సందర్భంగా చాలా దేశాల్లో కార్మికులకు సంబంధించి అనేక సంక్షేమ పథకాలు పుట్టుకొచ్చాయి. అలాగే సంక్షేమ పథకాల అమలుకు, నిరసన ప్రదర్శనలకు మే 1వ తేదీ వేదికగా మారింది. ముఖ్యంగా మేడే రోజున కార్మికులు వారి హక్కులను గుర్తు చేసుకోవడం, సమాజానికి వారు చేసిన సేవలకు గాను తగిన గుర్తింపు ఇచ్చి వారిని సన్మానించడం చేస్తున్నాం. 1916లో తొలిసారిగా రోజుకు 8 పని గంటలు మాత్రమే అన్న డిమాండ్‌కు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. మనదేశంలో ఇతర దేశాల కంటే ముందే కలకత్తాలో కార్మికుల పనిగంటల కోసం హౌరా రైల్వే స్టేషన్లో 1862లోనే సమ్మె చేశారు. 1923లో తొలిసారిగా భారత్ దేశంలో మే డే ను పాటించారు. ఆ తర్వాత 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడడంతో అప్పటి నుంచి కార్మికవర్గాల్లో చైతన్యం మొదలైంది. దీంతో మే డే పాటిస్తున్నారు. కానీ అసంఘటిత కార్మిక వర్గం అన్ని రంగాల్లో వచ్చింది. 1985 తర్వాత చోటుచేసుకున్న ప్రైవేటైజేషన్, లిబరలైజేషన్, గ్లోబలైజేషన్ పరిణామాల వల్ల అసంఘటిత కార్మికవర్గాల కార్మిక చట్టాలు అమలుకు నోచుకోవడంలేదు. మనదేశంలో అసంఘటిత రంగం పూర్తిగా నిరాదరణకు గురవుతోంది. నిర్మాణ, వ్యవసాయ, గిర కార్మిక రంగాలు పూర్తిగా వెలివేయ వడ్డాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 80కి పైగా దేశాల్లో కార్మిక దినోత్సవాన్ని జరుపుకుంటారు. సామాజిక న్యాయం, అందరికీ గౌరవప్రదమైన పనిని ప్రోత్సహించడానికి పాలకులు ముందుకు రావాలి. ముఖ్యంగా, ఐ.టి.రంగంలో ఎంతోమంది ఆడపిల్లలు, యువకులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్ శక్తులు ఎక్కడ శ్రమను దోచుకునే అవకాశం వుంటే అక్కడ కంపెనీలు పెడుతున్నారు. అమెరికాలో వున్న కంపెనీలు అక్కడ ప్రజాచైతన్యం ఉన్నది కాబట్టి కార్మిక చట్టాలు అమలుకానటువంటి ఇండియాలో కంపెనీలు పెడుతూ వాళ్ళచే 10,12 గంటలు పనిచేయి స్తున్నారు. ఐటి రంగంలో పనిచేస్తున్న విద్యావంతులైన యువత శ్రమ దోపిడీకి బలవుతున్నది. రాత్రుళ్లు ఆడపిల్లలను భద్రతలేకుండా ఇళ్ళకు పంపించడం మూలంగా నేరాల సంఖ్య కూడా పెరుగుతున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ వున్నంతవరకు శ్రమదోపిడీ, ఎక్కువ పనిచేయించుకోవడం సర్వసాధారణం. కార్మిక చట్టాలను ఐ.టి. రంగంలో కూడా అమలుకై పోరాటం ఇప్పుడు అత్యంత అవసరం. కార్మిక చట్టాలు అమలు చేయబోమని పాలకవర్గాలు బహుళజాతి కంపెనీలకు హామీలిస్తూ దేశంలోకి స్వాగతిస్తున్నాయి. అసంఘటితరంగంలో అయితే సరేసరి. ఇటీవల ప్రభుత్వం కాంట్రాక్టు, పార్ట్‌టైం ఉద్యోగుల పేరుతో ప్రవేశపెట్టిన ఔట్ సోర్సింగ్‌లోను కార్మిక చట్టాల నియమాలు అమలు కావడం లేదు. అందుకే అనేక సంస్థల్లో రెగ్యులర్ ఉద్యోగుల కన్నా కాంట్రాక్టు ఉద్యోగులే అధికమైనారు. అంతేకాకుండా ప్రభుత్వరంగంలో పనిచేసే ఉద్యోగుల సంఖ్య కూడా క్రమంగా తగ్గిపోయింది. నిరుద్యోగాన్ని, బలహీనతలను ఆసరా చేసుకొని వాళ్ళచే 10,12 గంటలు పనిచేయిస్తున్నారు. ఇది విద్యా, వైద్య రంగాల్లో ప్రయివేటీకరణ పెరిగిన కొద్దీ సర్వీసు భద్రత తక్కువవుతుంది కాబట్టి శ్రమదోపిడీ కూడా పెరుగుతుంది. వెనుకటికి స్కూళ్ళు 10 నుండి 14గంటల వరకు పనిచేసేవి. పిల్లవాణ్ణి ఆరు గంటల కంటే ఎక్కువ చదివించకూడదని విద్యావేత్తలు, పరిశోధకులు చెబుతున్నా, సెమీ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ పేర పాఠశాలలు సర్వసాధారణమైపోయాయి. అందుకే ప్రైవేట్ టీచర్స్ నోరు మెదపకుండా 12 గంటలు పనిచేయాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రపంచీకరణ వలన వంద సంవత్సరాల క్రితం సాధించిన కనీస డిమాండ్లు కూడా ఈనాడు అమలుకు నోచుకోవడంలేదు. ఎనిమిది గంటల పనికోసం చేసిన పోరాటం పెట్టుబడిదారీ వర్గం పతనానికి ఆరంభమవుతుందనుకున్నాం. కానీ మళ్ళీ మార్కెట్ శక్తులు పాత పరిస్థితులకు ప్రాణప్రతిష్ఠ చేస్తున్నాయి. ఆనాటి కార్మికవర్గ చైతన్యం మరోసారి వెల్లివిరుస్తుందని, ఈ మే డే నాడు కొత్త స్ఫూర్తిని రగిలిస్తుందని ఆశిద్దాం. ప్రపంచీకరణ, సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారులు, బహుళజాతి కంపెనీలు, మొదలైనవి శ్రామిక దోపిడీకి, కార్మిక చట్టాల ఉల్లంఘనకు సంఘటితమవుతున్న ఈ తరుణంలోనే ప్రపంచ కార్మికవర్గం ఆ శక్తులను ప్రతిఘటించేందుకు ద్విగుణీకృత ఉత్సాహంతో పోరాడాలి. ప్రపంచ శాంతిని అసలు ఈ భూగోళాన్నే కాపాడుకోవాల్సిన అవసరం కూడా ఉంది. అందుకు కార్మిక శ్రేణులు ఏకం కావాల్సిన చారిత్రక సందర్భం కూడా ఇదే.

# మా కొత్త ఆయుధంతో అమెరికాకు హార్ట్‌ఎటాకే

- అతిత్వరలో రహస్య అస్త్రాన్ని ప్రయోగిస్తాం
- అణు ఒప్పందం కుదిరే వరకు దిగ్బంధనం
- చివరి రక్తపు బొట్టు వరకు పోరాడుతాం
- ఇరాన్ నేవీ కమాండర్ రేర్ అడ్మిరల్ షారమ్



**టెహ్రాన్:** అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకూ ముదురుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ నేవీ కమాండర్ రేర్ అడ్మిరల్ షారమ్ ఇరానీ అమెరికాను ఉద్దేశించి అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేశారు. శత్రు బలగాలపై త్వరలోనే ఒక సరికొత్త ఆయుధంతో విరుచుకుపడతామని, అది అమెరికాను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తుందని ఆయన హెచ్చరించారు. ఆ ఆయుధం శత్రువుల పక్కనే ఉందని, దాని ధాటికి వారికి గుండెపోటు వచ్చే అవకాశం కూడా ఉందని ఆయన వ్యాఖ్యానించడం అంతర్జాతీయంగా సంచలనం సృష్టిస్తోంది. అయితే, ఆ రహస్య ఆయుధం ఏమిటనే వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. హర్మూజ్ జలసంధి దిగ్బంధనాన్ని ఎత్తివేస్తేనే చర్చలకు వస్తామన్న ఇరాన్ ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తోసిపుచ్చారు. అణు ఒప్పందం కుదిరే వరకు ఈ దిగ్బంధనం కొనసాగుతుందని, ఇందులో రాజీపడే ప్రసక్తే లేదని ట్రంప్ స్పష్టం చేశారు. సైనిక చర్య కంటే ఓడరేవుల దిగ్బంధనమే ప్రభావవంతంగా పనిచేస్తోందని, దీనివల్ల టెహ్రాన్ ఉక్కిరిబిక్కిరి అవుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇరాన్ తీవ్ర ఒత్తిడిలో ఉందని, రానున్న రోజుల్లో ఆ దేశ పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని ట్రంప్ హెచ్చరించారు. మరోవైపు, అమెరికా వ్యూహాలను ఇరాన్ కమాండర్ షారమ్ ఇరానీ కొట్టిపారేశారు. గతంలో అమెరికాకు చెందిన విమాన వాహక నౌక 'యూఎస్ఎస్ అబ్రహాం లింకన్'పై తమ దళాలు ఏడు క్షిపణులతో దాడి చేశాయని, దానివల్ల ఆ నౌక కార్యకలాపాలకు ఆటంకం కలిగిందని ఆయన గుర్తు చేశారు. అమెరికా ఆంక్షలు ఉన్నప్పటికీ తమ ఓడరేవుల నుంచి నౌకలు గమ్యస్థానాలకు చేరుకుంటున్నాయని ఆయన వెల్లడించారు. యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన తమ ప్రజల కోసం చివరి రక్తపు బొట్టు వరకు పోరాడి ప్రతీకారం తీర్చుకుంటామని, శత్రువులు పశ్చాత్తాపం చెందేవరకు వారిని దెబ్బకొడుతూనే ఉంటామని ఆయన ప్రతిజ్ఞ చేశారు.

# మీ చట్టాలను మార్చండి


- 15 ఏళ్ల బాలిక గర్భవిచ్ఛిత్తి కేసులో సుప్రీం కీలక వ్యాఖ్యలు
- గర్భాన్ని తొలగించుకునేలా చట్ట సవరణ చేయాలని కేంద్రానికి సూచన
- నిర్ణయాన్ని బాధిత బాలిక, ఆమె తల్లిదండ్రులకే వదిలేసిన అత్యున్నత న్యాయస్థానం



**న్యూఢిల్లీ:** అత్యాచార బాధితురాలైన 15 ఏళ్ల బాలిక గర్భవిచ్ఛిత్తి కేసులో సుప్రీంకోర్టు గురువారం అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేసింది. 30 వారాల గర్భాన్ని తొలగించుకునేందుకు బాలికకు గతంలోనే అనుమతినిచ్చిన కోర్టు, దీనిపై ఎయిమ్స్ దాఖలు చేసిన క్యూరేటివ్ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఈ దశలో గర్భవిచ్ఛిత్తి చేస్తే బాలిక ఆరోగ్యంపై దీర్ఘకాలికంగా తీవ్ర ప్రభావం పడుతుందని, డెలివరీకి ఇంకా నాలుగు వారాలే సమయం ఉన్నందున బిడ్డకు జన్మనిచ్చి దత్తతకు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని ఎయిమ్స్ తరపున అడిషనల్ సొలిసిటర్ జనరల్ కోర్టుకు వివరించారు. అయితే, ఈ వాదనలపై సుప్రీం ధర్మాసనం స్పందిస్తూ మానవీయ కోణంలో పలు సూచనలు చేసింది. ఇష్టం లేకుండా గర్భాన్ని కొనసాగించాలని ఒక మహిళను, ముఖ్యంగా అత్యాచారానికి గురైన మైనర్ బాలికను బలవంతం చేయలేమని కోర్టు స్పష్టం చేసింది. ఆ ఘటన తాలూకు క్షోభ బాధితురాలిని జీవితాంతం వెంటాడుతుందని, ఆమె పడే ఆవేదనను గుర్తించాలని పేర్కొంది. బాలిక ఆరోగ్యంపై శాశ్వత ప్రభావం లేనట్లయితే గర్భవిచ్ఛిత్తి నిర్వహించాలని, ఈ విషయంలో తుది నిర్ణయాన్ని బాధిత బాలిక మరియు ఆమె తల్లిదండ్రులకే వదిలేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు సరైన కౌన్సెలింగ్ ఇచ్చి వారు నిర్ణయం తీసుకోవడంలో సహాయం చేయాలని సూచించింది. ఇదే సమయంలో అత్యాచార బాధితుల కోసం దేశంలోని చట్టాలను సవరించాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. అత్యాచార కేసుల్లో బాధితులు గర్భం దాల్చితే, ఏ సమయంలోనైనా దాన్ని తొలగించుకునేలా మార్పులు తీసుకురావాలని పేర్కొంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం 20 వారాలు దాటిన తర్వాత గర్భవిచ్ఛిత్తికి ఉన్న పరిమితులను సవరించి, అత్యాచార బాధితులకు అవాంఛిత గర్భాన్ని తొలగించుకునే వెసులుబాటు కల్పించాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

# అమెరికాకు హ్యాండిచ్చిన పాక్

- ఇరాన్‌కు రహస్యంగా చేదోడు!
- పాక్ మీదుగా ఇరాన్ సరకు రవాణా
- విశ్వసనీయత కోల్పోతున్న పాకిస్థాన్..



**ఇస్లామాబాద్ :** అమెరికా, ఇరాన్‌ల మధ్య రాజీ కుదురుస్తామని ప్రపంచ వేదికలపై చెప్పుకుంటున్న పాకిస్థాన్, తెరవెనుక అమెరికా ప్రయోజనాలకు గండి కొడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అమెరికా విధించిన కఠినమైన దిగ్బంధనంతో ఉక్కిరిబిక్కిరవుతున్న ఇరాన్‌ను గట్టెక్కించేందుకు పాకిస్థాన్ అండగా నిలిచిందని పలువురు విశ్లేషకులు రుజువులతో సహా విమర్శిస్తున్నారు. ఈ క్రమంలో అమెరికా జాతీయ భద్రతా వ్యవహారాల నిపుణుడు డెరెక్ జే గ్రాస్‌మన్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం అంతర్జాతీయ రాజకీయాల్లో సంచలనంగా మారాయి. అమెరికా ఆంక్షల కారణంగా సముద్ర మార్గంలో ముడి చమురు మరియు ఇతర సరకులను ఎగుమతి చేయలేక ఇరాన్ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. ఈ సమస్యను అధిగమించడానికి పాకిస్థాన్ తన భూభాగం మీదుగా ఇరాన్ కంటెయినర్లను తరలించేందుకు అనుమతించిందని గ్రాస్‌మన్ ఆరోపించారు. ఇందుకోసం పాక్‌లోని ఆరు కీలక రహదారులను ఇరాన్ రవాణాకు కేటాయిస్తూ అక్కడి ప్రభుత్వం అధికారికంగా ప్రకటన విడుదల చేయడం గమనార్హం. ఈ పరిణామం ద్వారా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యూహాలకు గండి పడిందని గ్రాస్‌మన్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా హెచ్చరించారు. పాక్ కేటాయించిన ఈ ఆరు రహదారుల ద్వారా ఇరాన్ తన సరకులను రష్యాతో పాటు ఇతర దేశాలకు సులభంగా తరలించుకునే అవకాశం చిక్కిందని, తద్వారా అమెరికా ఒత్తిడిని తట్టుకుని నిలబడగలుగుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇప్పటికే ఈ చర్చల విషయంలో పాకిస్థాన్ తటస్థంగా ఉండే అవకాశం లేదని ఇజ్రాయెల్ అనుమానం వ్యక్తం చేసింది. పాక్‌ను ఏమాత్రం నమ్మలేమని భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి కూడా వ్యాఖ్యానించారు. ఈ పరిణామాల నేపథ్యంలో పాకిస్థాన్ ద్వంద్వ వైఖరి అమెరికాకు ఆగ్రహం తెప్పించే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.

# విజయం టీఎంసీదే..


## ఎగ్జిట్ పోల్స్‌పై మమతా బెనర్జీ నిప్పులు
## 226 కంటే ఎక్కువ సీట్లు గెలుస్తుందని ధీమా
## బీజేపీ కార్యాలయం నుంచే ఎగ్జిట్ పోల్



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఘన విజయం సాధించడం ఖాయమని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీ 226 కంటే ఎక్కువ స్థానాలను కైవసం చేసుకుంటుందని ఆమె స్పష్టం చేశారు. 'మా-మాటి-మానుష్' స్ఫూర్తితో టీఎంసీ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి బెంగాల్ ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొంటూ, ఆమె ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం తన పూర్తి యంత్రాంగాన్ని రంగంలోకి దించినప్పటికీ, అంతిమ విజయం తమదేనని ఆమె తేల్చి చెప్పారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలపై మమతా బెనర్జీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ గణాంకాలన్నీ బీజేపీ కార్యాలయం నుంచే విడుదలయ్యాయని ఆమె ఆరోపించారు. టీఎంసీ కార్యకర్తలు మరియు నాయకులలో భయాందోళనలు సృష్టించి, వారి మనోస్థైర్యాన్ని దెబ్బతీసేందుకే బీజేపీ ఇలాంటి తప్పుడు సంఖ్యలను ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. రెండో దశ ఎన్నికల సమయంలో తన నియోజకవర్గమైన భవానీపూర్‌లో రాత్రంతా దాడులు జరిగాయని ఆరోపించిన మమతా, ఓట్ల లెక్కింపు రోజున పార్టీ శ్రేణులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కోరారు. బుధవారం సాయంత్రం బెంగాల్ ఎన్నికలు ముగిసిన వెంటనే విడుదలైన మెజారిటీ ఎగ్జిట్ పోల్స్, బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఉందని పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో స్పందించిన మమతా బెనర్జీ, ఈ అంచనాలన్నీ కుట్రపూరితమైనవని కొట్టిపారేశారు. రాష్ట్ర ప్రజలంతా ఐక్యంగా ఉండి లెక్కింపు ప్రక్రియను నిశితంగా గమనించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఫలితాలు తమ పార్టీకి అనుకూలంగానే ఉంటాయని, మరోసారి టీఎంసీ అధికార పీఠాన్ని అధిరోహిస్తుందని ఆమె పునరుద్ఘాటించారు.

# సుదీర్ఘ యుద్ధానికి సిద్ధం

## రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు



**ఢిల్లీ:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా.. చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను భారత్ తన సొంత నిర్ణయం మేరకే నిలిపివేసిందని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. అవసరమైతే సుదీర్ఘ యుద్ధానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఏఎన్ఐ నిర్వహించిన నేషనల్ సెక్యూరిటీ సమ్మిట్ 2.0లో మాట్లాడుతూ కేంద్ర మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. సామర్థ్యం లేక ఆపరేషన్ సిందూర్‌ను ఆపేయలేదని, అది ఒక వ్యూహాత్మకమైన నిర్ణయమని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. 'ఈ ఆపరేషన్ మన సాయుధ దళాల సమైక్యతకు కూడా ఒక ఉదాహరణ. ఇందులో మన త్రివిధ దళాలు సమన్వయంతో ముందుకు వెళ్లాయి. సొంత నిబంధనల ప్రకారమే ఆపరేషన్‌ను ప్రారంభించి.. సరైన సమయంలోనే దాన్ని ముగించాం. ఇది స్వచ్ఛందంగా తీసుకున్న నిర్ణయం. అవసరమైతే సుదీర్ఘ యుద్ధానికి పూర్తి సిద్ధంగా ఉన్నాం' అని అన్నారు. ఉగ్రవాదం మానవత్వానికి మాయని మచ్చ అని పేర్కొన్నారు. దీనిపై పోరాటం కేవలం భద్రతకు సంబంధించిన విషయమే కాదని.. మానవత్వపు మౌలిక విలువలను పరిరక్షించేందుకని వ్యాఖ్యానించారు.

### పాక్ ఇంటర్నేషనల్ టెర్రరిజంకు కేంద్ర బిందువు..

ఈ సందర్భంగా పాకిస్థాన్‌పై రాజ్‌నాథ్ సింగ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ దేశాన్ని అంతర్జాతీయ ఉగ్రవాదానికి కేంద్రంగా అభివర్ణించారు. ఉగ్రవాదం కేవలం దేశ వ్యతిరేక చర్య మాత్రమే కాదని.. దానికి బహుముఖ కోణాలున్నాయన్నారు. దాన్ని కూకటివేళ్లతో సహా పెకిలించేయాలని ఆయన పిలుపునిచ్చారు. పాక్ నిరంతరం ఉగ్రవాదానికి మద్దతిస్తోందని మండిపడ్డారు. భారత్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి కేంద్రమైతే.. పాక్ ఇంటర్నేషనల్ టెర్రరిజానికి కేంద్ర బిందువుగా మారిందంటూ ఎద్దేవా చేశారు.

# బాలికపై లైంగిక దాడి.. నిందితుడి అరెస్టు!

- జన్నారం మండలంలో దారుణ ఘటన
- ఫొటోలతో బ్లాక్‌మెయిల్ చేసి దారుణం
- నిందితుడు డొంగరి లక్ష్మణ్‌పై పోక్సో కేసు
- వెంటనే స్పందించి అరెస్టు చేసిన పోలీసులు



**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

జన్నారం మండలంలో దారుణం చోటుచేసుకుంది. ఫొటోలు మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరించి ఒక ఇంటర్ విద్యార్థినిపై యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఓ మైనర్ బాలిక ఇంటర్ పరీక్షలు ముగించుకుని వేసవి సెలవుల కోసం జన్నారంలోని తన పిన్ని ఇంటికి వచ్చింది. కవ్వాల్ గ్రామానికి చెందిన డోంగరి లక్ష్మణ్ (20) అనే యువకుడు ఆమెతో మాటలు కలిపి పరిచయం పెంచుకున్నాడు. నమ్మకం కుదిరిన తర్వాత ఆమెతో కలిసి కొన్ని ఫొటోలు దిగాడు. ఆ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పెడతానంటూ బాలికను బ్లాక్‌మెయిల్ చేయడం మొదలుపెట్టాడు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం బయటపెడితే పరువు తీస్తానని బెదిరించాడు.

### పోక్సో చట్టం కింద కేసు

బాధితురాలు ధైర్యం చేసి జరిగిన విషయాన్ని తన తల్లికి చెప్పడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. సీఐ రమణమూర్తి పర్యవేక్షణలో ఎస్సై జి. ఉదయ్ కిరణ్ తన సిబ్బందితో కలిసి వెంటనే విచారణ చేపట్టారు. నిందితుడు లక్ష్మణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా తన నేరాన్ని అంగీకరించాడు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో చట్టంలోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మహిళలు, బాలికల రక్షణకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని, సామాజిక మాధ్యమాల వేదికగా వేధింపులకు పాల్పడితే ఎంతటి వారినైనా వదిలిపెట్టబోమని ఈ సందర్భంగా సీఐ రమణమూర్తి హెచ్చరించారు.



# అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం!

- జన్నారం అటవీ అధికారుల మెరుపు దాడులు
- నాలుగు రోజుల్లో నాలుగు ట్రాక్టర్ల సీజ్
- ఎకో సెన్సిటివ్ జోన్‌లో నిఘా పెంపు
- అక్రమార్కులపై కఠిన చర్యలు తప్పవు: ఎఫ్‌డీఓ

**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

అడవిని అడ్డం పెట్టుకుని అక్రమ సంపాదనకు తెరలేపిన ఇసుక అసురుల ఆటను జన్నారం అటవీ అధికారులు కట్టించారు. అటవీ శాఖ అధికారికి అందిన పక్కా సమాచారంతో బుధవారం తెల్లవారుజామున ఇందన్‌పల్లి సెక్షన్ పరిధిలో మెరుపు దాడులు నిర్వహించారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టరును స్వాధీనం చేసుకున్నారు.

### వరుస దాడులతో వణుకు

గత నాలుగు రోజులుగా అటవీ శాఖ అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతోంది. మంగళవారం రెండు ట్రాక్టర్లు పట్టుబడగా.. బుధవారం తెల్లవారుజామున మరో వాహనాన్ని సీజ్ చేశారు. ఇలా నాలుగు రోజుల్లో నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకోవడం గమనార్హం. ఈ దాడుల్లో ఎఫ్ఎస్ఓ రవి, ఎఫ్‌బీఓలు రాజేశ్వర్, శ్రీనివాస్.. బేస్ క్యాంప్ సిబ్బంది అత్యంత సాహసోపేతంగా వ్యవహరించి వాహనాలను అడ్డుకున్నారు.

### నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ముఖ్యంగా ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలో ప్రకృతి సంపదను కొల్లగొడితే ఊరుకునే ప్రసక్తి లేదని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు. అటవీ చట్టాల ప్రకారం అక్రమార్కులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. అటవీ వాగుల నుంచి ఇసుక తరలిస్తే వాహనాల సీజ్‌తో పాటు భారీ జరిమానాలు తప్పవని తెలిపారు. విలువైన కలపను నరికినా.. వన్యప్రాణుల జోలికి వచ్చినా కటకటాల వెనక్కి పంపుతామని హెచ్చరించారు. అడవిలో జరిగే ఎలాంటి అక్రమ కార్యకలాపాలనైనా ప్రజలు గమనిస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.

# విద్యార్థులు అధైర్యపడొద్దు!

**పరీక్షల్లో ఫెయిలైనంత మాత్రాన జీవితం ముగిసిపోదు**

**తక్కువ మార్కులు వచ్చినా ఆందోళన చెందవద్దు**

**పిల్లలపై ఒత్తిడి పెంచకుండా తల్లిదండ్రులు అండగా ఉండాలి**

**జన్నారం ఎస్సై ఉదయ్ కుమార్**

**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**



పదో తరగతి ఫలితాల నేపథ్యంలో విద్యార్థులు ఎవరూ ఆందోళన చెందవద్దని, పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయినా.. తక్కువ మార్కులు వచ్చినా అధైర్యపడి ప్రాణాలు తీసుకోవద్దని జన్నారం ఎస్సై ఉదయ్ కుమార్ కోరారు. పరీక్ష ఫలితాలు కేవలం ఒక దశ మాత్రమేనని, అవి జీవితాన్ని నిర్ణయించేవి కావని స్పష్టం చేశారు. ఒకసారి విఫలమైనంత మాత్రాన జీవితం ముగిసిపోదని, సప్లిమెంటరీ పరీక్షల్లో కష్టపడి చదివి విజయం సాధించే అవకాశం ఎప్పుడూ ఉంటుందని విద్యార్థులకు హితవు పలికారు. ఆవేశంలో తీసుకునే తొందరపాటు నిర్ణయాలు కుటుంబాలకు తీరని శోకాన్ని మిగులుస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య ఏదైనా ఉంటే తోటి వారు, ఉపాధ్యాయులతో పంచుకోవాలని సూచించారు. పిల్లలపై చదువు విషయంలో ఒత్తిడి తీసుకురాకుండా వారికి తోడుగా నిలబడాలని తల్లిదండ్రులకు సూచించారు. వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపి, భవిష్యత్తుపై నమ్మకాన్ని కలిగించాల్సిన బాధ్యత పెద్దలపై ఉందన్నారు. తీవ్రమైన మానసిక ఒత్తిడి, నిరాశలో ఉన్న విద్యార్థులు వెంటనే కౌన్సెలింగ్ కేంద్రాలను, సమీపంలోని పోలీస్ స్టేషన్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. పోలీసులు ఎల్లవేళలా విద్యార్థుల సంక్షేమానికి తోడ్పాటునందిస్తారని భరోసా ఇచ్చారు.

# కూలీలకు వడదెబ్బ తగలకుండా ఓఆర్ఎస్ పంపిణీ!

**పోరెడ్డిపల్లెలో ఉపాధి కూలీలకు అవగాహన**

**ఐకేపీ సెంటర్‌లో రైతులు, హమాలీలకు పంపిణీ**



**కోహెడ (జనం పవర్):** కోహెడ మండలం పోరెడ్డిపల్లె గ్రామంలోని ఐకేపీ సెంటర్‌లో రైతులు, హమాలీ సభ్యులు, ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొంటున్న మహిళల కోసం ఓఆర్ఎస్ పంపిణీ కార్యక్రమం జరిగింది. గ్రామ సర్పంచ్ డబ్బేడా రజిత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేసవి కాలంలో డీహైడ్రేషన్ సమస్యలు ఎక్కువగా ఉండే నేపథ్యంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా ఈ ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఎండలు తీవ్రంగా ఉన్న ఈ కాలంలో రైతులు, ఉపాధి కూలీలు తరచుగా నీరు, ఓఆర్ఎస్ వంటి ద్రావణాలు తీసుకోవాలని సూచించారు. శరీరంలో నీటి లోపం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గ్రామ ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. ముఖ్యంగా కష్టపడి పనిచేసే కార్మికులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సంపత్ ప్రభాకరరెడ్డి, ఏఎన్ఎం స్వరూప, ఫీల్డ్ అసిస్టెంట్ ఆనంతారం భాగ్య పాల్గొన్నారు. వీరితో పాటు వీఓ చుంచు లావణ్య, డీలర్ పంజాల సుజాత, బండి శ్రీనివాస్, మంద లక్ష్మణ్, ఉపాధి కూలీలు, రైతులు హాజరయ్యారు.

# బస్వాపూర్‌లో ఘనంగా పోచమ్మ బోనాలు!



**గౌడ సంఘం ఆధ్వర్యంలో పూజలు.. ఎల్లమ్మ పండుగకు ముందు బోనాలు**

**గ్రామంలో ఆధ్యాత్మిక శోభ.. సుఖశాంతుల కోసం మొక్కులు.. భక్తితో పాల్గొన్న గౌడ సంఘం పెద్దలు**





**కోహెడ (జనం పవర్):** సిద్దిపేట జిల్లా కోహెడ మండలం బస్వాపూర్ గ్రామంలో ఎల్లమ్మ పండుగ వేడుకలకు అంకురార్పణ జరిగింది. గౌడ సంఘం ఆధ్వర్యంలో గ్రామ దేవత పోచమ్మ అమ్మవారికి భక్తులు ఘనంగా బోనాలు సమర్పించారు. సంప్రదాయబద్ధంగా అలంకరించిన బోనాలను మహిళలు తలపై ఎత్తుకుని గ్రామ వీధుల గుండా డప్పు చప్పుళ్ల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా గ్రామమంతా పండుగ వాతావరణంతో కళకళలాడింది. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, పంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థించారు. ఈ పండుగ గ్రామంలో చెడు శక్తులను తొలగించి శాంతిని కలిగిస్తుందని ప్రజలు విశ్వసిస్తారు. ఈ వేడుకల్లో గౌడ సంఘం పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, హారతులు, నైవేద్యాలు సమర్పించారు. గ్రామ ప్రజల ఐక్యత, భక్తి, సంప్రదాయాల పట్ల గౌరవం ఈ కార్యక్రమంలో స్పష్టంగా ప్రతిబింబించింది. పోచమ్మ బోనాల అనంతరం గ్రామంలో ఎల్లమ్మ పండుగ వేడుకలకు మరింత ఉత్సాహం నెలకొంది.

# అభివృద్ధి శిల్పులు.. కానీ హక్కులలో వెనుకబడిన వారు!

**ప్రతి సంవత్సరం మే 1న ప్రపంచవ్యాప్తంగా "కార్మిక దినోత్సవం"ను జరుపుకుంటారు. ఈ రోజు కార్మికుల శ్రమ, త్యాగాలు మరియు వారి హక్కులను వెలుగులోకి తేవడానికి ఉద్దేశించబడింది. అయితే వాస్తవంలో కార్మికుల హక్కుల గురించి మాట్లాడే సమయంలో చాలా మంది తమ స్వార్థ ప్రయోజనాలను ముందుకు పెట్టి న్యాయం చేయడంలో వెనుకబడుతారు అనే చేదు నిజం ఉంది.**

నేడు మేడే (ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక వ్యాసం)

వ్యాసకర్త
ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్
ఉపాధ్యక్షుడు జమియతుల్ ఉలేమా ఉమ్మడి కరీంనగర్ జిల్లా



నేడు మనం చూస్తున్న అభివృద్ధిఎత్తైన భవనాలు, ఆధునిక రహదారులు, పరిశ్రమలు లేదా సాంకేతిక పురోగతి ఇవన్నీ కార్మికుల చెమట, కష్టం ఫలితమే. ఫ్యాక్టరీల ఉత్పత్తి అయినా, కంపెనీల విజయాలైనా, ప్రతి చోట కార్మికుల కృషి ప్రధాన పాత్ర పోషిస్తుంది. కానీ విచారకరమైన విషయం ఏమిటంటే, ఈ అభివృద్ధికి పునాది వేసిన కార్మికులే తమ ప్రాథమిక అవసరాలకు కూడా దూరంగా ఉంటున్నారు.

ఇస్లాం కార్మికులకు గౌరవాన్ని మాత్రమే కాదు, వారి హక్కులను కూడా స్పష్టంగా నిర్దేశించింది. ప్రవక్త ముహమ్మద్ కార్మికులను "సోదరులు"గా సంబోధిస్తూ, వారితో మంచి ప్రవర్తన చేయాలని ఉపదేశించారు. ఒక హదీస్‌లో "కార్మికుడి చెమట ఎండకముందే అతని కూలీ ఇవ్వాలి" అని చెప్పబడింది, ఇది సమయానికి వేతనం చెల్లించే ప్రాముఖ్యతను తెలియజేస్తుంది।

ఇస్లాం హక్కుల గురించి మాత్రమే కాకుండా నైతిక బాధ్యతలను కూడా గుర్తుచేస్తుంది. మరో హదీస్ ప్రకారం, కార్మికునితో పూర్తిగా పని చేయించుకుని అతనికి కూలీ ఇవ్వని వ్యక్తి న్యాయదినాన కఠినంగా ప్రశ్నించబడతాడు. ఇది కార్మికుల హక్కుల ప్రాముఖ్యతను స్పష్టం చేస్తుంది।

నేటి ప్రపంచంలో కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారుతక్కువ వేతనాలు, బలవంతపు శ్రమ, బాల కార్మికత్వం మరియు ప్రాథమిక హక్కుల లేమి. ప్రపంచ స్థాయిలో ఇది ఒక తీవ్రమైన సమస్యగా మారింది. చాలా మంది కార్మికులు యూనియన్లు ఏర్పాటు చేసుకోవడం, ఆరోగ్య సదుపాయాలు పొందడం మరియు సురక్షితమైన పని వాతావరణం పొందడంలో వెనుకబడి ఉన్నారు. ఇది మన మనస్సాక్షికి ప్రశ్నగా నిలుస్తుంది।

మరొక విషాదకరమైన విషయం ఏమిటంటే, కార్మికుల కష్టంతో పరిశ్రమల యజమానులు అపారమైన సంపద సంపాదిస్తారు, కానీ కార్మికులు మాత్రం పేదరికంలోనే జీవించాల్సి వస్తుంది. న్యాయం ఏమిటంటే, ఒక వ్యాపారాన్ని అభివృద్ధి చేసిన కార్మికుల హక్కులను పూర్తిగా కాపాడాలి।

కార్మిక దినోత్సవం మనకు ఒక సందేశం ఇస్తుంది: ఇది కేవలం ఒక రోజు ఉత్సవంగా కాకుండా, కార్మికుల హక్కులను నిజంగా అమలు చేసే దిశగా అడుగులు వేయాలి. ఇస్లాం సూచించిన సమతుల్యమైన మరియు న్యాయమైన విధానం అమలు చేస్తే సమాజంలో శాంతి, సమానత్వం మరియు అభివృద్ధి సాధ్యమవుతుంది।

### ఇస్లామిక్ బోధనల ప్రకారం కార్మికుల ముఖ్య హక్కులు ఇవి

- మొదట, కూలీని సమయానికి మరియు పూర్తిగా చెల్లించాలి, తద్వారా దోపిడీ జరగకుండా ఉంటుంది।
- రెండవది, పని ప్రకారం సరైన వేతనం నిర్ణయించాలి; తక్కువ కూలీ ఇవ్వడం అన్యాయం।
- మూడవది, కార్మికుడి సామర్థ్యానికి మించి పని వేయకూడదు।
- నాలుగవది, గౌరవంతో మరియు మంచి ప్రవర్తనతో వ్యవహరించాలి।
- ఐదవది, పని ప్రారంభానికి ముందు కూలీ మరియు నిబంధనలను స్పష్టంగా నిర్ణయించాలి।

చివరగా చెప్పాల్సిన విషయం ఏమిటంటే, కార్మికులు కేవలం ఒక వర్గం కాదువారు సమాజానికి వెన్నెముక. వారి గౌరవం, వారి హక్కుల రక్షణ మరియు వారితో న్యాయం చేయడం ఒక సుసంస్కృత సమాజానికి గుర్తు. నిజమైన అభివృద్ధి కోరుకుంటే, కార్మికులకు వారి హక్కులను ఇవ్వాల్సిందేఅదే మన సమిష్టి విజయానికి మార్గం।

## మే 2న సంగారెడ్డిలో భారీ గౌరక్షణ సభ!

**ఫడల్వాడిలో పోస్టర్‌ను ఆవిష్కరించిన ప్రముఖులు**



**సంగారెడ్డి (జనం పవర్):** విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) గౌరక్ష విభాగ్ సంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో మే 2వ తేదీన గౌరక్షణ సభ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఫడల్వాడిలోని శ్రీ జ్యోతిర్వస్తు విద్యాపీఠంలో సభకు సంబంధించిన పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. గౌమాత సంరక్షణ, హిందూ ధర్మ పరిరక్షణ లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టారు. గోవు ప్రాముఖ్యతను చాటిచెప్పడానికి ఈ సభ వేదిక కానుందని నిర్వాహకులు పేర్కొన్నారు. మే 2న జరిగే ఈ సభకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ గౌరక్ష ప్రాంత ప్రముఖ్ మధురమని సుభాష్ చందర్, జిల్లా కార్యదర్శి జైరాం రెడ్డి పాల్గొన్నారు. బజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ లక్ష్మణ్ కూడా హాజరయ్యారు. హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని వీహెచ్‌పీ కార్యకర్తలు పిలుపునిచ్చారు.

## ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం!

**ధాన్యం కొనుగోళ్లపై బీఆర్ఎస్ అనవసర రాద్ధాంతం**

**రైతులను తప్పుదోవ పట్టించేలా విపక్షాల కుట్రలు**

**రెండు లక్షల రుణమాఫీకి ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**కేసీఆర్ హయాంలో రైతులపై పెట్టిన సంకెళ్లను మరువద్దు**

**స్పష్టం చేసిన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్**

**సిద్దిపేట (జనం పవర్):** రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ స్పష్టం చేశారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో బీఆర్ఎస్ పార్టీ అనవసర రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు అన్ని ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

**విపక్షాల మొసలి కన్నీరు**

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులను విస్మరించిన కేసీఆర్ ప్రభుత్వాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. రైతులు తమ సమస్యలపై నిరసన వ్యక్తం చేస్తే సంకెళ్లు వేసిన ఘటనలను ప్రజలు మర్చిపోలేదని గుర్తుచేశారు. రైతులను అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ నీచ రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. రుణమాఫీ విషయంలో హరీష్ రావు కోర్టుకు వెళ్లడాన్ని విడ్డూరంగా అభివర్ణించారు.

**రుణమాఫీ అమలు చేస్తాం**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీని ఖచ్చితంగా అమలు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకుల మొసలి కన్నీరును రైతులు గమనిస్తున్నారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్యాదరి మధు, గయాజుద్దీన్, అర్షద్ హుస్సేన్, విజయ డానియల్, నజ్జు బాబా పాల్గొన్నారు.





## శాస్త్రీయ వ్యవసాయంతోనే రైతులకు మేలు!

- దాసుగడ్డ తండాలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం
- భూసార పరీక్షలు, పంట మార్పిడిపై రైతులకు అవగాహన
- పాల్గొన్న శాస్త్రవేత్తలు ఎం. శాంతి, ఏ. గీత

**సంగారెడ్డి (జనం పవర్):** సంగారెడ్డి మండలం దాసుగడ్డ తండాలో పీజేటీఎస్ఏయూ తో పాటు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు శాస్త్రవేత్తలు విస్తృత అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల అధిక వాడకం వల్ల ఆహారం విషపూరితమయ్యే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. భూసార పరీక్షలు చేయించి, పంట మార్పిడి పద్ధతులు పాటించడం వల్ల నేల సారం పెరుగుతుందని తెలిపారు. జీవామృతం వంటి పద్ధతులతో ప్రకృతి వ్యవసాయం చేస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వస్తుందని సూచించారు. పప్పు దినుసుల సాగుతో పాటు ఆయిల్ పామ్ తోటల పెంపకంపై రైతులకు వివరించారు. నకిలీ, హెచ్‌టీ కాటన్ విత్తనాల పట్ల రైతులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు కోరారు. విత్తనాలు కొనేటప్పుడు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం సిఫార్సు చేసిన బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-15048, కేఎన్ఎం-1638 వంటి నాణ్యమైన రకాలను మాత్రమే సాగు చేయాలన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు పనిచేస్తున్నాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లోక్య నాయక్, అదనపు సంచాలకులు వైద్యనాథ్, అధికారులు ఝాన్సీ లక్ష్మి, గాయత్రి, రూప్‌సింగ్ పాల్గొన్నారు.

## ఏర్దనూర్‌లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు!

**ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు అవగాహన**

**యూరియా వాడకం తగ్గించి సేంద్రియ సాగు చేపట్టాలి**

**వివరించిన శాస్త్రవేత్తలు డాక్టర్ హుస్సేన్, డాక్టర్ పరుశురాం**



**సంగారెడ్డి (జనం పవర్):** కంది మండలం ఏర్దనూర్ గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. గ్రామ సర్పంచ్ పంబల జ్యోతి దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటల దిగుబడి పెంపు, గిట్టుబాటు ధరలు సాధించే మార్గాలపై శాస్త్రవేత్తలు రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా ప్రత్యామ్నాయ పంటలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రైతులు తమ సందేహాలను శాస్త్రవేత్తలతో చర్చించి నివృత్తి చేసుకున్నారు.

**సేంద్రియ పద్ధతులతో మేలు**

యూరియా వాడకాన్ని వీలైనంత వరకు తగ్గించాలని, సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అలవాటు చేసుకోవాలని రైతులకు వివరించారు. సేంద్రియ సాగు ద్వారా భూసారాన్ని కాపాడుకోవడమే కాకుండా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని స్పష్టం చేశారు. రైతుల అభ్యున్నతి, వ్యవసాయాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా అధికారులు రైతులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఆసియా బేగం, ఏఈఓ సంగీత, పీఏసీఎస్ సుల్తానా పాల్గొన్నారు. గ్రామానికి చెందిన రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## 62 మంది చిన్నారులకు ఉచిత సైకిళ్ల పంపిణీ!

**విడతల వారీగా సైకిళ్ల పంపిణీ కార్యక్రమం**

**62 మంది పాఠశాల విద్యార్థులకు లబ్ధి**

**బడికి వెళ్లేందుకు విద్యార్థుల విన్నపం**

**25 మంది బాలికలు, 37 మంది బాలురకు అందజేత**

**సంగారెడ్డి (జనం పవర్):** సంగారెడ్డి పట్టణంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న 62 మంది చిన్నారులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. ఇప్పటివరకు తమ కార్యాలయంలో పేర్లను నమోదు చేయించుకున్న విద్యార్థులకు విడతల వారీగా ఈ సైకిళ్లు అందజేస్తున్నట్లు జగ్గారెడ్డి వివరించారు. సైకిళ్ల పంపిణీ సందర్భంగా ఆయన విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు.

**విద్యార్థుల విన్నపం మేరకు పంపిణీ**

ఇంటి నుంచి పాఠశాలకు వెళ్లి వచ్చేందుకు ఇబ్బందిగా ఉందని, సైకిళ్లు కావాలని తాము అడిగినట్లు విద్యార్థులు తెలిపారు. వారి విన్నపం మేరకు 25 మంది బాలికలు, 37 మంది బాలురకు సైకిళ్లను అందజేశారు. విద్యార్థులు వీటిని ఉపయోగించుకుని చదువులో రాణించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చేర్యాల ఆంజనేయులు, జార్జ్ మాథ్యూస్, కూన సంతోష్ హాజరయ్యారు. వీరితో పాటు కిరణ్ గౌడ్, శ్రీకాంత్, మహేష్ ముదిరాజ్, రాజు, సుదీప్ తదితరులు పాల్గొన్నారు.







# బతుకు పోరులో శ్రమజీవి కన్నీటి గాథ!

- ఎండను లెక్కచేయకుండా సాగుతున్న పనులు
- ఆకాశాన్ని తాకుతున్న ధరలతో సరిపోని కూలి
- జీవిత బీమా లేక అభద్రతలో కుటుంబాలు
- అభివృద్ధి చక్రానికి వారే అసలైన వెన్నెముక

**సిద్దిపేట (జనం పవర్):** మే 1 కార్మిక దినోత్సవం సందర్భంగా సిద్దిపేటలో కార్మికులు తమ కష్టాలను గుర్తు చేసుకుంటూ హక్కుల కోసం గొంతెత్తారు. బీజేఆర్ చౌరస్తాఉహుస్నాబాద్ రోడ్ పరిధిలో హార్డ్‌వేర్, సిమెంట్ దుకాణాల్లో పనిచేసే కూలీలు, హమాలీలు, భవన నిర్మాణ కార్మికులు తమ సమస్యలపై గళం విప్పారు. తీవ్ర ఎండల్లో రోజుకు రూ.500 నుంచి రూ.600 కూలితో శ్రమిస్తూ కుటుంబాలను పోషిస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

## తగ్గుతున్న ఉపాధి అవకాశాలు

ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వలస కార్మికుల రాకతో స్థానికులకు పని అవకాశాలు తీవ్రంగా తగ్గుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తమకు జీవిత బీమా, భద్రతా పథకాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. 'మా చెమటే తెలంగాణ నిర్మాణానికి పునాది' అని వారు నినదించారు. ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులకు మెరుగైన ఆరోగ్య సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్మికుల కష్టం తెలంగాణ అభివృద్ధికి వెన్నెముకగా నిలుస్తుందని పలువురు వక్తలు కొనియాడారు.

# మున్సిపల్ అభివృద్ధి పనులకు పచ్చజెండా!

- 26 అజెండా అంశాలకు కౌన్సిల్ ఆమోదం
- రోడ్ల మరమ్మతుల కోసం కోటి 74 లక్షలు
- వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక నిధులు
- స్వచ్ఛ సర్వేక్షణ్ 2026కు ప్రజల సహకారం
- వెల్లడించిన చైర్‌పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు




**సిద్దిపేట (జనం పవర్):** పట్టణ పురపాలక సంఘ కార్యాలయంలో చైర్‌పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మొత్తం 26 అజెండా అంశాలను చర్చించి పాలకవర్గం ఆమోదం తెలిపింది. గత ఐదేళ్లుగా పట్టణ అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా చైర్‌పర్సన్ కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలోని రోడ్ల గుంతల పూడ్చివేత పనుల కోసం కోటి 74 లక్షల రూపాయలను కౌన్సిల్ కేటాయించింది. నీటి సరఫరా పరికరాల కొనుగోలు, మరమ్మతులకు 30 లక్షలు, 19వ వార్డులో వాటర్ ట్యాంక్ ప్రహరీ గోడ నిర్మాణానికి 15 లక్షలు ఆమోదించారు. అలాగే ఎస్టీపీ నిర్వహణ, ఎంఎస్ ల్యాడర్ ఏర్పాటుకు 10 లక్షల రూపాయలు మంజూరు చేశారు. పట్టణ పారిశుద్ధ్య కార్మికుల దుస్తులు, ఇతర సామాగ్రి కోసం మరో 10 లక్షల రూపాయలు కేటాయించారు.

## ప్రజల భాగస్వామ్యం అవసరం

43 వార్డుల్లో వీధి కుక్కల నియంత్రణ (ఏబీసీ ఆపరేషన్) కోసం 10 లక్షల రూపాయలు కేటాయిస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2026లో భాగంగా ప్రజలు తమ ఫీడ్‌బ్యాక్ ఇచ్చి పట్టణానికి మంచి ర్యాంకు వచ్చేలా సహకరించాలని కోరారు. వీధి దీపాల నిర్వహణకు లైన్మెన్ల నియామకం, కంప్యూటర్ విడిభాగాల మరమ్మతులకు కూడా ఆమోదం లభించింది. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, కమిషనర్ అశ్రిత్ కుమార్, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.



# కరీంనగర్ జిల్లా టాపర్‌గా కాకతీయ విద్యాసంస్థలు!

- పదో తరగతి ఫలితాల్లో జిల్లాలోనే అగ్రస్థానం
- విద్యా రంగానికి ఆదర్శంగా సుధాకర్ రావు సేవలు
- చైర్మన్‌ను ఘనంగా సన్మానించిన హరీష్ వర్మ అప్పని

**జమ్మికుంట (జనం పవర్):** కరీంనగర్ జిల్లా పదో తరగతి ఫలితాల్లో మొదటి స్థానం సాధించి సత్తా చాటిన కాకతీయ విద్యాసంస్థల చైర్మన్ అవిర్నేని సుధాకర్‌ను బిఆర్ఎస్వీ మాజీ రాష్ట్ర కార్యదర్శి హరీష్ వర్మ అప్పని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా పెట్టుకుని నాణ్యమైన విద్య అందించే దిశగా అహర్నిశలు శ్రమిస్తున్న సుధాకర్ రావు విద్యా రంగానికి ఒక ప్రేరణ అని హరీష్ వర్మ కొనియాడారు. జిల్లాలో నంబర్ వన్ ఫలితాలు సాధించడం సాధారణ విషయం కాదని.. అది కేవలం కష్టానికి, క్రమశిక్షణకు, నిబద్ధతకు నిదర్శనమని తెలిపారు. విద్యా వికాసానికి అంకితభావంతో పనిచేస్తున్న ఆయన లాంటి నాయకత్వం ఉండటం విద్యార్థుల అదృష్టమని పేర్కొన్నారు. ఈ విజయంతో జమ్మికుంట కాకతీయ విద్యాసంస్థల ఖ్యాతి మరింత పెరిగిందని హరీష్ వర్మ ఆనందం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఈ సంస్థ మరిన్ని రికార్డులు సృష్టించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ప్రయోజనాలే పరమావధిగా పనిచేస్తున్న యాజమాన్యాన్ని, ఉపాధ్యాయ బృందాన్ని ఈ సందర్భంగా అభినందించారు.





# మొక్కజొన్న పంట దగ్ధం

- శేఖాపూర్‌లో అగ్ని ప్రమాదం.. పంట నష్టం
- హుటాహుటిన పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే
- నష్టాన్ని అంచనా వేయాలని అధికారులకు ఆదేశం
- బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా
- హామీ ఇచ్చిన జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు

**జుక్కల్ (జనం పవర్):** కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం శేఖాపూర్ గ్రామంలో నిన్న రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో మొక్కజొన్న పంట విస్తారంగా కాలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు శుక్రవారం ఉదయం గ్రామానికి చేరుకుని బాధిత రైతుల పొలాలను పరిశీలించారు.

## అధికారులకు ఆదేశాలు

ఘటనపై పూర్తి వివరాలు సేకరించి అగ్ని ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పంట నష్టాన్ని అంచనా వేసి వెంటనే నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. రైతులకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

# పదో తరగతిలో 585 మార్కులతో స్మిత ప్రభంజనం!

- శ్రీ వాణి స్కూల్ విద్యార్థిని అద్భుత ప్రతిభ
- ఫొటో స్టూడియో దంపతుల కుమార్తె ఘన విజయం
- సాధారణ కుటుంబం నుంచి వచ్చి అసాధారణ ఫలితం
- క్రమశిక్షణ, కృషితోనే ఈ విజయం సాధ్యమైంది
- అభినందించిన ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు




**సిద్దిపేట (జనం పవర్):** సిద్దిపేట పట్టణంలోని భారత్ నగర్‌లో ఉన్న శ్రీ వాణి స్కూల్ విద్యార్థిని కోట నాగర స్మిత ఎస్ఎస్‌సీఉ2026 పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. 600 మార్కులకు గాను 585 మార్కులు సాధించి ఘన విజయాన్ని అందుకుంది. ఈ సందర్భంగా స్మిత ప్రతిభను చూసి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానికులు అభినందనలు తెలిపారు. కోట నాగర స్మిత తల్లిదండ్రులు శ్రీవిద్య, రాజకుమార్ దంపతులు ఫొటో స్టూడియో నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. తమ కుమార్తె చదువు కోసం వారు ఎంతో ప్రోత్సాహాన్ని అందించారు. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన స్మిత కష్టపడి చదివి ఈ స్థాయి విజయాన్ని సాధించడం విశేషంగా నిలిచింది. స్మిత క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమ వల్లే ఈ అద్భుత ఫలితం సాధ్యమైందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆశీర్వదించారు. స్థానిక ప్రముఖులు, బంధువులు, స్నేహితులు స్మితను అభినందిస్తూ ఆమెకు మంచి భవిష్యత్తు ఉండాలని, సమాజంలో గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు.

చిన్న కోమటీపల్లిలో నరసింహస్వామి జయంతి!

# స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వేడుకలు

- పంచామృత, నవవిధ అభిషేకాలు, ప్రత్యేక పూజలు
- స్వామివారికి విశేష అలంకరణ, దివ్య దర్శనం
- తరలివచ్చిన హనుమాన్ దీక్షాధారులు, భక్తులు
- పూజలు నిర్వహించిన ప్రధాన అర్చకులు ప్రదీప్ శర్మ



**జమ్మికుంట (జనం పవర్):** ఇల్లందకుంట మండలం చిన్న కోమటీపల్లి గ్రామంలోని స్వయంభూ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో గురువారం శ్రీ నరసింహ స్వామి జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు ప్రదీప్ శర్మ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. స్వామివారి జయంతి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. స్వామివారికి పంచామృత అభిషేకంతో పాటు నవవిధ అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు స్వామివారి దివ్య దర్శనం కల్పించేందుకు విశేషమైన అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ దీక్ష స్వీకరించిన అనేకమంది భక్తులు, గ్రామస్తులు భారీగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

# ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి బాట!

- తాళ్లపేటలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం
- డ్రైనేజీ, రోడ్ల కోసం పది లక్షల నిధులు మంజూరు
- డీఎంఎఫ్‌టీ నిధులతో గ్రామానికి కొత్త శోభ
- అభివృద్ధికి సహకరించిన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు
- కృతజ్ఞతలు తెలిపిన మండల కార్యదర్శి కంది సతీష్

**దండేపల్లి (జనం పవర్):** మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం తాళ్లపేట్ గ్రామం దుబ్బగూడెంలో సీసీ రోడ్డు పనులను స్థానిక మాజీ ఎంపీటీసీ కంది హేమలత సతీష్ కుమార్ కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి కంది సతీష్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి కోసం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పది లక్షల డీఎంఎఫ్‌టీ నిధులను మంజూరు చేశారని తెలిపారు. సీసీ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు కేటాయించిన ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో ఎమ్మెల్యే ఆశీస్సులతో గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కళావతి, మాజీ సర్పంచ్ కాంతారావు, ఉప సర్పంచ్ పుట్టపాక తిరుపతి పాల్గొన్నారు. వీరితో పాటు వార్డు సభ్యులు ఆకుల రామయ్య, కుమార్, మీనాక్షి నవీన్, స్థానిక నాయకులు సందెల తిరుపతి, శ్రీధర్, సాదిక్, మడావి శ్రీనివాస్, దుర్గం రవీందర్, కొంపల రవీందర్, సింధం అనూష మహేష్, హన్మయ్య హాజరయ్యారు.



జనం పవర్
JANAM POWER

శుక్రవారం
01 మే 2026

# ఫలితం ఏదైనా బిడ్డలను అక్కున చేర్చుకోండి!

**పదో తరగతి ఫలితాల వేళ విద్యార్థులకు పోలీసుల భరోసా**

**మార్కుల కంటే నిండు ప్రాణమే అత్యంత ముఖ్యం**

**ఫలితాలు జీవితానికి ముగింపు కాదు.. విజయానికి తొలి మెట్టు**

**పిల్లలను ఇతరులతో పోల్చి ఒత్తిడికి గురిచేయవద్దు**

**కోహెడ ఎస్సై పి. అభిలాష్**

**కోహెడ (జనం పవర్):** తెలంగాణలో పదో తరగతి ఫలితాల సందడి మొదలైంది. విద్యార్థుల్లో ఒకవైపు ఉత్కంఠ.. మరోవైపు ఆందోళన కనిపిస్తోంది. ఈ క్రమంలో కోహెడ పోలీసులు రంగంలోకి దిగి 'మార్కుల కంటే ప్రాణం ముఖ్యం' అంటూ కీలక సూచనలు చేశారు. పరీక్షల్లో వచ్చే మార్కులు కేవలం ఒక అంకె మాత్రమేనని.. అవి జీవితాన్ని శాసించలేవని ఎస్సై స్పష్టం చేశారు. ఫలితాలు ఎలా ఉన్నా ఆత్మహత్య వంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు. ఫలితం ఏదైనా అది జీవితానికి ముగింపు కాదు.. తదుపరి విజయానికి మొదటి మెట్టు మాత్రమేనని విద్యార్థులకు ధైర్యం చెప్పారు. ఫలితాల తర్వాత పిల్లలపై అనవసర ఒత్తిడి తీసుకురావద్దని తల్లిదండ్రులను కోరారు. వారిని ఇతరులతో పోల్చి చిన్నబుచ్చవద్దని హెచ్చరించారు. పిల్లలు మౌనంగా ఉన్నా.. ఒంటరిగా ఉండటానికి ప్రయత్నిస్తున్నా.. వెంటనే వారితో ప్రేమగా మాట్లాడి ధైర్యం కల్పించాలన్నారు. భవిష్యత్తుకు ప్రాణమే పునాది అని.. పోలీసులు ఎల్లవేళలా అండగా ఉంటారని భరోసా ఇచ్చారు.

# రూ. 20 వేల లంచం.. ఏసీబీకి చిక్కిన బిల్ కలెక్టర్!

**ఇంటి పన్ను తగ్గింపు కోసం భారీగా డిమాండ్**

**సదాశివపేట మున్సిపాలిటీలో అవినీతి వెలుగు**

**లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ పట్టు**

**ఔట్‌సోర్సింగ్ బిల్ కలెక్టర్‌పై ఏసీబీ పంజా**

**వివరాలు వెల్లడించిన ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ రెడ్డి**



**సదాశివపేట (జనం పవర్):** సంగారెడ్డి జిల్లా సదాశివపేట మున్సిపాలిటీలో అవినీతి ఘటన వెలుగుచూసింది. మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న నిఖిల్ రెడ్డి గురువారం ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఓ వ్యక్తి ఇంటి పన్ను తగ్గించేందుకు రూ. 35 వేల లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం.

### పక్కా ప్లాన్‌తో పట్టుకున్న అధికారులు

బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో పక్కా ప్రణాళికతో అధికారులు ఉచ్చు వేశారు. ఇందులో భాగంగా నిఖిల్ రెడ్డి రూ. 20 వేల లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు అతడిని పట్టుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. సదాశివపేటలో ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం సహించం!

**కందిలో డీఎల్ పీఓ మల్లారెడ్డి ఆకస్మిక తనిఖీ**

**గ్రామాల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలి**

**మంచినీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలి**

**విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు**

**తనిఖీల్లో పాల్గొన్న ఎంపీవో మహేందర్ రెడ్డి**

**కంది (జనం పవర్):** సంగారెడ్డి జిల్లా కంది గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, మంచినీటి సరఫరా పరిస్థితులను డీఎల్ పీఓ మల్లారెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలోని పలు ప్రాంతాలను పరిశీలిస్తూ పారిశుద్ధ్య పనుల పురోగతిని సమీక్షించారు.

### నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

గ్రామాల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం స్థానిక అధికారుల బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మంచినీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీల్లో ఎంపీవో మహేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కవిత పాల్గొన్నారు.



# సంగారెడ్డి సమస్యల పరిష్కారానికి మంత్రికి విన్నపం!

- ఇందిరమ్మ, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై చర్చ
- ల్యాండ్ పూలింగ్ రైతులకు న్యాయం చేయాలి
- టీజీఐఐసీ భూముల్లో శ్మశాన వాటికలకు కేటాయింపు
- వక్ఫ్ రికార్డుల నుంచి రైతుల భూముల తొలగింపు
- మంత్రి పొంగులేటిని కోరిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్





**సంగారెడ్డి (జనం పవర్):** ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజాప్రతినిధుల సమీక్షా సమావేశంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొన్నారు. నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక సమస్యలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, రైతుల భూముల సమస్యలు, ల్యాండ్ పూలింగ్ అంశాలపై పాయింట్ టూ పాయింట్ వివరించారు.

### ఇళ్ల కేటాయింపులో పారదర్శకత ఉండాలి

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో ఎమ్మెల్యే కోటా కింద మంజూరు చేయడంలో జాప్యం జరుగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ఇందిరమ్మ కమిటీ ప్రమేయం లేకుండానే మంజూరులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా ఇళ్లు కేటాయించాలని కోరారు. గతంలో మంజూరైన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలను తక్షణమే పూర్తి చేసి అర్హులకు అందజేయాలని విన్నవించారు. కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

### రైతు సమస్యల పరిష్కారానికి విన్నపం

టీజీఐఐసీ భూ సేకరణ వల్ల గ్రామాల్లో శ్మశాన వాటికలకు స్థలాలు మిగలడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. భవిష్యత్ అవసరాల కోసం గ్రామాలకు తగిన స్థలాలను కేటాయించాలని సూచించారు. హెచ్ఎండీఏ ల్యాండ్ పూలింగ్ కింద భూములు ఇచ్చిన రైతులకు హామీ ఇచ్చిన ప్రకారం 600 గజాల స్థలాన్ని అభివృద్ధి చేసి ఇవ్వాలని కోరారు. బాధితులకు రైతుబంధు, రైతు బీమా అందేలా చూడాలన్నారు. పెద్దాపూర్ సర్వే నంబర్ 476లోని భూములపై రైతులు నర్సరీలు నిర్వహిస్తున్నారని.. అదనపు భూముల స్వాధీన ప్రయత్నాలను ఆపాలని కోరారు. అలియాబాద్ గ్రామంలో 44 ఎకరాల భూమి పొరపాటున వక్ఫ్ రికార్డుల్లో నమోదైందని.. రైతుల వద్ద పక్కా పత్రాలు ఉన్నందున ఆ భూమిని వక్ఫ్ రికార్డుల నుంచి వెంటనే తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

# పది ఫలితాల్లో కాకతీయ ప్రభంజనం!

- 100 శాతం ఉత్తీర్ణతతో విద్యార్థుల మెరుపులు
- సగానికి పైగా విద్యార్థులకు 500 పైగా మార్కులు
- అగ్రస్థానంలో నిలిచిన మహేష్, హర్షిత్, రోహన్
- విద్యార్థులు మహనీయుల అడుగుజాడల్లో నడవాలి
- అభినందించిన బీ స్మార్ట్ జనరల్ సెక్రటరీ జగ్గు మల్లారెడ్డి





**సిద్దిపేట (జనం పవర్):** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కాకతీయ హైస్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. తెలంగాణ రాష్ట్రంలో విడుదలైన ఎస్ఎస్సీ ఫలితాల్లో ఈ పాఠశాల మరోసారి అద్భుత ప్రతిభ కనబరిచి 100 శాతం ఉత్తీర్ణత సాధించింది. పాఠశాల టాపర్‌గా కె. మహేష్ కుమార్ 559 మార్కులు సాధించగా.. హర్షిత్ కుమార్ 545, ఏ. రోహన్ కుమార్ 543 మార్కులు సాధించి సత్తా చాటారు.

### మెరిసిన విద్యార్థులు

మొత్తం విద్యార్థుల్లో 50 శాతానికి పైగా 500 కంటే ఎక్కువ మార్కులు సాధించడం పాఠశాల విద్యా ప్రమాణాలకు నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే కష్టపడి చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా సూచించారు.

### మహనీయుల బాటలో నడవాలి

పదో తరగతి ఫలితాలు విద్యార్థి జీవితంలో మొదటి మైలురాయి అని.. విద్యార్థులు గొప్ప మహనీయుల జీవిత చరిత్రలను చదివి వారి అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో సమాజానికి దిశానిర్దేశకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీ స్మార్ట్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ జగ్గు మల్లారెడ్డితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

# ఒక చేత్తో బైబిల్.. మరో చేత్తో రాజ్యాంగం పట్టుకోవాలి!

- జన్నారంలో భారీగా 'క్రైస్తవ ఐక్యవేదిక' సదస్సు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల హక్కుల కోసం పోరాటం
- అన్యాయానికి గురైన బాధితులకు అండగా ఉంటామని హామీ
- వివిధ మండలాల నూతన కమిటీల నియామకం
- పిలుపునిచ్చిన సిడిఎఫ్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఇస్సారపు ఎలీషా




**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

జన్నారం మండల కేంద్రంలో సిడిఎఫ్ (క్రిస్టియన్ డెమొక్రటిక్ ఫోరం) ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా విభాగం ఆధ్వర్యంలో 'క్రైస్తవ ఐక్యవేదిక' సదస్సు భారీగా నిర్వహించారు. పాస్టర్ షాలెమ్ రాజు అధ్యక్షతన జరిగిన ఈ సభకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో క్రైస్తవులు, సామాజిక కార్యకర్తలు తరలివచ్చారు.

### సామాజిక బాధ్యత అవసరం

ప్రతి క్రైస్తవుడు ఆధ్యాత్మిక బోధనలతో పాటు సామాజిక బాధ్యతను కలిగి ఉండాలని వక్తలు పిలుపునిచ్చారు. ఒక చేత్తో బైబిల్ పట్టుకుని దైవవాక్యాన్ని బోధిస్తూనే.. మరో చేత్తో రాజ్యాంగాన్ని పట్టుకుని హక్కుల గురించి ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రసాదించిన రాజ్యాంగ హక్కులను ఎవరూ అడ్డుకోలేరని స్పష్టం చేశారు.

### బడుగుల పక్షాన పోరాటం

ఈ పోరాటం కేవలం క్రైస్తవుల కోసమే కాదని.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల హక్కుల రక్షణ కోసం సిడిఎఫ్ నిరంతరం శ్రమిస్తుందని నేతలు ప్రకటించారు. క్రైస్తవుల పట్ల వివక్ష చూపేవారికి తగిన బుద్ధి చెబుతామని, ఎక్కడ సమస్య ఉంటే అక్కడ బాధితుల పక్షాన నిలబడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వివిధ మండలాలకు సంబంధించి నూతన కమిటీలను ప్రకటించి బాధ్యులకు నియామక పత్రాలను అందజేశారు.

ఈ సభలో ముఖ్య అతిథిగా సిడిఎఫ్ జాతీయ అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ ఇస్సారపు ఎలీషా హాజరై ప్రసంగించారు. జాతీయ కమిటీ సభ్యులు, రాష్ట్ర ప్రతినిధులు, వివిధ మండలాల నాయకులు ఈ సభలో పాల్గొన్నారు.



# శార్దూల్‌పై వింత వ్యూహం


**ముంబై, ఏప్రిల్ 30 :** ఐపీఎల్ 2026లో ముంబై జట్టు మరో ఓటమిని చవిచూసిన మ్యాచ్ కంటే, ఆ జట్టు తీసుకున్న ఒక నిర్ణయం ఇప్పుడు పెద్ద చర్చగా మారింది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన పోరులో ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన శార్దూల్ ఠాకూర్ బ్యాటింగ్ గానీ, బౌలింగ్ గానీ చేయకపోవడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ జట్టు భారీ స్కోరు నమోదు చేసింది. ఓపెనర్లుగా వచ్చిన విల్ జాక్స్, రియాన్ రికిల్టన్ మంచి ఆరంభం ఇవ్వగా, ముఖ్యంగా రియాన్ రికిల్టన్ అద్భుత సెంచరీతో చెలరేగి జట్టును భారీ స్కోరు దిశగా నడిపించాడు. అతని దూకుడు బ్యాటింగ్‌తో ముంబై నిర్ణీత ఓవర్లలో భారీ పరుగులు చేసింది. అయితే లక్ష్య ఛేదనలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ ఓపెనింగ్‌లోనే వేగంగా పరుగులు సాధించి జట్టుకు బలమైన పునాది వేశారు. అనంతరం హెన్రిచ్ క్లాసెన్ వేగవంతమైన అర్ధశతకంతో మ్యాచ్‌ను హైదరాబాద్ వైపు తిప్పేశాడు. దీంతో హైదరాబాద్ జట్టు లక్ష్యాన్ని సులభంగా ఛేదించింది. అయితే మ్యాచ్ తర్వాత ఎక్కువ చర్చకు దారి తీసింది ముంబై జట్టు వ్యూహమే. ఇంపాక్ట్ ప్లేయర్‌గా తీసుకొచ్చిన శార్దూల్ ఠాకూర్‌ను ఎందుకు ఉపయోగించలేదన్న ప్రశ్నలు సామాజిక మాధ్యమాల్లో వెల్లువెత్తాయి. ఐపీఎల్ చరిత్రలో ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చి ఒక్క బంతి కూడా ఆడకపోవడం అరుదైన సంఘటనగా అభిమానులు చర్చిస్తున్నారు. ఈ నిర్ణయం వెనుక అసలు వ్యూహం ఏమిటో స్పష్టత లేకపోవడంతో ముంబై యాజమాన్యంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మొత్తం మీద ఈ మ్యాచ్ ఫలితంతో పాటు, శార్దూల్ అంశం కూడా ఈ సీజన్‌లో ప్రధాన చర్చాంశంగా మారింది.



# హిట్‌మ్యాన్‌కు జన్మదిన శుభాకాంక్షలు

**ముంబై, ఏప్రిల్ 30 :** భారత క్రికెట్ జట్టు కెప్టెన్, 'హిట్‌మ్యాన్'గా పేరుగాంచిన రోహిత్ శర్మ ఇవాళ 39వ పుట్టిన రోజు జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులు, ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. భారత జట్టుకు ఐసీసీ ట్రోఫీలు అందించిన ప్రముఖ కెప్టెన్లలో రోహిత్ శర్మ ఒకరు. టెస్టులు, టీ20 ఫార్మాట్లకు ఇప్పటికే వీడ్కోలు పలికిన రోహిత్ ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే ఆడుతున్నారు. ఐపీఎల్‌లో ముంబై జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన, గాయం కారణంగా ఇటీవల కొన్ని మ్యాచ్‌లకు దూరంగా ఉన్నారు. వన్డే క్రికెట్ చరిత్రలో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన ఆటగాడిగా రోహిత్ శర్మ ప్రత్యేక గుర్తింపు పొందారు. 2014లో శ్రీలంకపై జరిగిన మ్యాచ్‌లో ఆయన 173 బంతుల్లోనే 264 పరుగులు చేసి చరిత్ర సృష్టించారు. అంతేకాకుండా వన్డేల్లో మూడు డబుల్ సెంచరీలు సాధించిన ఏకైక బ్యాటర్ కూడా ఆయనే. 2013లో ఆస్ట్రేలియాపై 209 పరుగులు, 2014లో శ్రీలంకపై 264 పరుగులు, 2017లో మరోసారి శ్రీలంకపైనే 208 పరుగులు చేసి అరుదైన రికార్డును నెలకొల్పారు. 2019 వన్డే ప్రపంచకప్‌లో రోహిత్ అద్భుత ప్రదర్శన కనబరిచి 9 ఇన్నింగ్స్‌ల్లో 5 శతకాలు నమోదు చేశారు. మొత్తంగా ప్రపంచకప్‌లలో ఆయన 7 శతకాలు సాధించడం విశేషం. నాయకత్వంలో కూడా రోహిత్ విజయవంతంగా కొనసాగుతూ, 2024 టీ20 ప్రపంచకప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ వంటి ఐసీసీ టోర్నీల్లో భారత్‌ను విజేతగా నిలిపారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇప్పటివరకు 650 సిక్సర్లు బాదిన రోహిత్, ఈ విభాగంలో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ఈ జాబితాలో భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని 359 సిక్సర్లతో రెండో స్థానంలో ఉన్నారు. తన అద్భుత ఆటతీరుతో, నాయకత్వంతో భారత క్రికెట్‌కు విశేష సేవలందించిన రోహిత్ శర్మకు అభిమానులు మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నారు.

# సొంతగడ్డపై గుజరాత్ గర్జన!



బెంగళూరుపై నాలుగు వికెట్ల తేడాతో టైటాన్స్ ఘన విజయం

155 పరుగులకే కుప్పకూలిన ఆర్సీబీ బ్యాటింగ్

ఆడుతూపాడుతూ లక్ష్యాన్ని ఛేదించిన గుజరాత్ బ్యాటర్లు

**చెలరేగిన శుభ్‌మన్ గిల్, బట్లర్, అర్షద్ ఖాన్**

**వృథా అయిన పడిక్కల్, భువనేశ్వర్ పోరాటం**





**అహ్మదాబాద్:** అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా గురువారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుపై గుజరాత్ టైటాన్స్ అద్భుత విజయం సాధించింది. బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో సమష్టిగా సత్తా చాటిన టైటాన్స్ జట్టు.. సొంతగడ్డపై అభిమానులకు అసలైన మజాను పంచింది. బెంగళూరు నిర్దేశించిన 156 పరుగుల లక్ష్యాన్ని కేవలం 15.5 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది.

## తడబడిన ఆర్సీబీ..



అంతకుముందు టాస్ గెలిచిన గుజరాత్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో మొదట బ్యాటింగ్ కు దిగిన బెంగళూరు జట్టు ఏ దశలోనూ భారీ స్కోరు చేసేలా కనిపించలేదు. గుజరాత్ బౌలర్ల ధాటికి 19.2 ఓవర్లలో 155 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ దేవ్ దత్ పడిక్కల్ 24 బంతుల్లో 40 పరుగులు చేసి జట్టులో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ 13 బంతుల్లో 28 పరుగులతో కాసేపు మెరుపులు మెరిపించినా ఆ ఇన్నింగ్స్ ఎక్కువ సేపు సాగలేదు. రజత్ పాటిదార్ 15 బంతుల్లో 19 పరుగులు చేశాడు. గుజరాత్ బౌలర్లలో అర్షద్ ఖాన్ అద్భుతంగా బౌలింగ్ చేసి 3.2 ఓవర్లలో 22 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. స్పిన్ మాంత్రికుడు రషీద్ ఖాన్ నాలుగు ఓవర్లలో కేవలం 19 పరుగులిచ్చి రెండు వికెట్లు తీశాడు. జేసన్ హోల్డర్‌కు రెండు వికెట్లు దక్కాయి.

## లక్ష్యాన్ని కరిగించిన గిల్, బట్లర్..

156 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్‌కు అదిరిపోయే ఆరంభం దక్కింది. ఓపెనర్ శుభ్‌మన్ గిల్ కేవలం 18 బంతుల్లోనే 43 పరుగులతో బెంగళూరు బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అతనికి తోడుగా జోస్ బట్లర్ 19 బంతుల్లో 39 పరుగులు చేసి జట్టు విజయాన్ని ఖాయం చేశాడు. చివర్లో రాహుల్ తెవాటియా 17 బంతుల్లో అజేయంగా 27 పరుగులు చేసి మరో 25 బంతులు మిగిలి ఉండగానే జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. బెంగళూరు బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ నాలుగు ఓవర్లలో 28 పరుగులిచ్చి మూడు వికెట్లు తీసి ఆకట్టుకున్నాడు. రొమారియో షెపర్డ్ రెండు వికెట్లు దక్కించుకోగా.. సుయాష్ శర్మ ఒక వికెట్ తీశాడు. పరుగుల రక్షణలో బౌలర్లు శ్రమించినా.. బ్యాటర్లు చేసిన తప్పులతో బెంగళూరుకు పరాజయం తప్పలేదు.



# బుమ్రాపై పొలార్డ్ మద్దతు

**ముంబై, ఏప్రిల్ 30 :** ఐపీఎల్ 2026లో ముంబై జట్టు ప్రధాన బౌలర్ బుమ్రా ప్రదర్శనపై వస్తున్న విమర్శలకు జట్టు బ్యాటింగ్ కోచ్ పొలార్డ్ బలమైన సమాధానం ఇచ్చారు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో బుమ్రా అధిక పరుగులు ఇవ్వడం చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో ఆయన స్పందించారు. ఆ మ్యాచ్‌లో బుమ్రా నాలుగు ఓవర్లలో అధిక పరుగులు ఇచ్చినా, దాన్ని పెద్దగా చూడాల్సిన అవసరం లేదని పొలార్డ్ అన్నారు. బుమ్రా ఏదైనా యంత్రం కాదని, అతడూ ఒక మనిషే కాబట్టి అప్పుడప్పుడు ఇలాంటి పరిస్థితులు రావడం సహజమని స్పష్టం చేశారు. ప్రస్తుతం కొంత ఫామ్ లోపం కనిపిస్తున్నా, త్వరలోనే తిరిగి తన అసలు స్థాయికి చేరుకుంటాడని నమ్మకం వ్యక్తం చేశారు. ఇన్నేళ్లుగా ముంబై జట్టుకు, భారత జట్టుకు బుమ్రా కీలక బౌలర్‌గా నిలిచాడని గుర్తు చేస్తూ, ఒక్క మ్యాచ్ ఆధారంగా అతడిని విమర్శించడం సరైంది కాదని తెలిపారు. జట్టు కోసం ఎన్నో విజయాలు అందించిన ఆటగాడికి మద్దతుగా నిలవాల్సిన సమయం ఇదేనని అన్నారు. మరోవైపు ఈ సీజన్‌లో ముంబై జట్టు ఆశించిన స్థాయిలో రాణించకపోయినా, ఇంకా అవకాశాలు పూర్తిగా ముగియలేదని పొలార్డ్ చెప్పారు. ఇప్పటివరకు ఆడిన మ్యాచ్‌లలో తక్కువ విజయాలు సాధించినా, మిగిలిన మ్యాచ్‌ల్లో గెలిచి ప్లే ఆఫ్స్‌కు చేరేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. జట్టు ఇంకా పోటీలోనే ఉందని, చివరి వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# రెండొందల పరుగులు సులభం ఎందుకు?



**ముంబై, ఏప్రిల్ 30 :** ఐపీఎల్ ప్రస్తుత సీజన్‌లో మ్యాచ్‌లు భారీ స్కోర్ల వేదికగా మారాయి. దాదాపు ప్రతి మ్యాచ్‌లో రెండొందలకుపైగా పరుగులు నమోదు అవుతుండటంతో బౌలర్లపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు స్పిన్ బౌలింగ్ కోచ్ ముత్తయ్య మురళీధరన్ స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ముప్పైసార్లకు పైగా రెండొందల స్కోర్లు నమోదవ్వడం, అలాగే భారీ లక్ష్యాలు కూడా సులభంగా ఛేదించబడటం గమనార్హమని ఆయన తెలిపారు. అయితే దీనికి బౌలర్లను తప్పుపట్టడం సరికాదని స్పష్టం చేశారు. ప్రధాన కారణం పిచ్‌లేనని పేర్కొన్నారు. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే పిచ్‌లు తయారు చేయడం వల్ల టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ వేగంగా పరుగులు సాధిస్తున్నారని అన్నారు. ఇక మైదానాల్లో బౌండరీ పరిమాణం చిన్నగా ఉండటం కూడా బౌలర్లకు ఇబ్బందిగా మారిందని తెలిపారు. పిచ్‌ను బౌలర్లకు అనుకూలంగా మార్చితే మ్యాచ్‌లు నెమ్మదిగా సాగుతాయని, అది ప్రేక్షకులకు విసుగును కలిగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రేక్షకులు ఎక్కువగా ఫోర్లు, సిక్సులు ఆశిస్తారని, అందుకే ఈ మార్పులు తీసుకొచ్చారని వివరించారు. ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనతో అదనంగా ఒక బ్యాట్స్‌మన్ అవకాశం పొందడం వల్ల స్కోర్లు మరింత పెరుగుతున్నాయని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఐపీఎల్ కేవలం ఆట మాత్రమే కాకుండా పెద్ద వ్యాపారంగా మారిందని, ఇందులో స్పాన్సర్లు, వీక్షకుల సంఖ్య ఎంతో కీలకమని స్పష్టం చేశారు. మ్యాచ్‌లు ఆసక్తికరంగా లేకపోతే ప్రేక్షకులు చూడరని, అప్పుడు స్పాన్సర్లకు నష్టం కలుగుతుందని ఆయన హెచ్చరించారు. అందుకే వినోదానికి ప్రాధాన్యం ఇస్తూ ఆటలో మార్పులు తీసుకువస్తున్నారని తెలిపారు. క్రికెట్ అభివృద్ధి కంటే ప్రేక్షకులకు వినోదం అందించడం కూడా సమానంగా ముఖ్యమైందని ఆయన అభిప్రాయపడ్డారు.

# వైభవ్‌పై ముంబై కన్ను



**ముంబై, ఏప్రిల్ 30 :** ఐపీఎల్ 2026లో సంచలనంగా మారిన యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ పై ఇప్పుడు అన్ని జట్ల దృష్టి పడుతోంది. ముఖ్యంగా ముంబై ఇండియన్స్ వంటి దిగ్గజ జట్టు ఈ యువ ప్రతిభను తమ జట్టులోకి తీసుకురావాలనే ఆసక్తి చూపుతున్నట్లు క్రికెట్ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇంగ్లాండ్ మాజీ వేగవంత బౌలర్ స్టువర్ట్ బ్రాడ్ వైభవ్ ఆటపై ప్రశంసలు కురిపించాడు. ప్రపంచ స్థాయి బౌలర్లను కూడా భయపడకుండా ఎదుర్కొంటూ అతను చూపుతున్న ధైర్యం, ప్రతిభ అసాధారణమని పేర్కొన్నాడు. ఇంత చిన్న వయసులోనే ఇలాంటి స్థాయిలో ఆడటం అరుదైన విషయం అని ఆయన అభిప్రాయపడ్డాడు. గతంలో రాజస్థాన్ రాయల్స్ జట్టు వైభవ్‌ను తక్కువ ధరకు ఎంపిక చేసుకున్నప్పటికీ, ఇప్పుడు అతని ప్రదర్శన చూస్తుంటే భవిష్యత్తులో అతని విలువ భారీగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మళ్లీ వేలంలోకి వస్తే అతని ధర ఎంతో ఎక్కువగా ఉండొచ్చని నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఐపీఎల్ నిబంధనల ప్రకారం ఆటగాళ్లను చాలా కాలం పాటు ఒకే జట్టులో ఉంచడం కష్టమైన విషయం. ఈ నేపథ్యంలో రాజస్థాన్ జట్టు వైభవ్‌ను కొనసాగించగలదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు యువ ఆటగాళ్లను గుర్తించి అవకాశాలు ఇచ్చే విషయంలో ముందుండే ముంబై జట్టు, ఈ ప్రతిభను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నించే అవకాశాలు ఉన్నట్లు అంచనాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తానికి వైభవ్ సూర్యవంశీ ప్రదర్శనతో ఐపీఎల్‌లో అతనిపై భారీ ఆసక్తి నెలకొంది. భవిష్యత్తులో అతను ఏ జట్టుకు ఆడతాడు అన్నది ఆసక్తికరంగా మారింది.




## మెడికల్ మాఫియా బాగోతంపై దూత-2

ఓటీటీ ప్రపంచంలో డార్క్, రియలిస్టిక్ కథనాలకు పెరుగుతున్న ఆదరణ మధ్య దూత సీజన్ 2పై ఆసక్తి రోజురోజుకీ పెరుగుతోంది. మొదటి సీజన్ జర్నలిజం బ్యాక్‌డ్రాప్‌లో సస్పెన్స్, హారర్ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకోగా ఈ సిరీస్, ఇప్పుడు పూర్తిగా కొత్త జానర్ వైపు మలుపు తిరగడం హాట్ టాపిక్‌గా మారింది. ఈసారి మేకర్స్ మెడికల్ మాఫియా వంటి సున్నితమైన అంశాన్ని ఎంచుకోవడం విశేషం. ఆరోగ్య రంగంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, మాఫియా నెట్వర్క్‌ను రియలిస్టిక్‌గా చూపించే ప్రయత్నం చేస్తున్నట్టు సమాచారం. దీంతో సిరీస్ మరింత డార్క్, గ్రిప్పింగ్ నేరేషన్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునే అవకాశం ఉంది. ఈ మార్పు వెనుక ప్రధాన బలం దర్శకుడు విక్రమ్ కె. కుమార్ విజన్ అని చెప్పాలి. థ్రిల్లర్ కథనాల్లో తన ప్రత్యేక శైలిని నిరూపించుకున్న ఆయన, సీజన్ 1లో జర్నలిజం ప్రపంచంలోని అంధకార కోణాలను చూపించినట్లే, ఈసారి మెడికల్ రంగంలోని లోపాలను షాకింగ్ ఎలిమెంట్స్‌తో తెరపైకి తీసుకురానున్నారు. ప్రస్తుతం ఓటిటి ప్లాట్‌ఫార్మ్‌లలో ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్స్‌కు భారీ డిమాండ్ ఉంది. రియలిస్టిక్, డార్క్ కంటెంట్‌కు ప్రేక్షకులు ఎక్కువగా ఆకర్షితులవుతున్న నేపథ్యంలో, 'దూత 2' కూడా అదే ట్రెండ్‌ను క్యాష్ చేసుకునేలా రూపొందుతోంది. 'దూత' మొదటి సీజన్ మంచి రెస్పాన్స్ అందుకోవడంతో, రెండో సీజన్‌పై అంచనాలు సహజంగానే పెరిగాయి. ఈ సిరీస్‌లో ప్రధాన పాత్రలో నాగ చైతన్య నటించడం మరో ప్లస్ పాయింట్. ఆయన స్టార్ ఇమేజ్, కథలోని తీవ్రత కలిసి ప్రేక్షకులకు మరింత ఇంటెన్స్ అనుభూతిని అందించే అవకాశముంది.



## అగధలో మంజుల మనవరాలు జోవిక

ప్రముఖ సీనియర్ దర్శక నిర్మాత ఎమ్మెస్ రాజు ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న మిస్టికల్ డివైన్ థ్రిల్లర్ 'అగధ'. హారర్ జానర్‌లో రాబోతున్న ఈ చిత్రం నుంచి తాజాగా ఆసక్తికరమైన అప్‌డేట్ వెలువడింది. ఈ సినిమా ద్వారా తమిళ నటి వనితా విజయ్ కుమార్ కుమార్తె,అలనాటి మంజుల మనవరాలు జోవిక విజయ్ కుమార్ టాలీవుడ్‌కు పరిచయం అవుతున్నారు. చిత్రంలో ఆమె 'హరిణి' అనే పవర్‌ఫుల్ పాత్రను పోషిస్తుండగా, దీనికి సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో ఆమెను ఒక తీవ్రమైన శక్తిగా అభివర్ణించారు మేకర్స్. శ్రీ ఆదివరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బాలుసు నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రావణ్ రెడ్డి 'సింహ'గా, కామాక్షి భాస్కర్ల 'మహాదేవి'గా నటిస్తుండగా, ఉల్కా గుప్తా, షిజు అబ్దుల్ రషీద్ వంటి తారలు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం మరియు హిందీ భాషల్లో విడుదల కానున్న ఈ సినిమాకు సుమారు 45 నిమిషాల పాటు సాగే భారీ వీఎఫ్ఎక్స్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ప్రస్తుతం షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ చిత్రానికి రాకేష్ వెంకటాపురం సంగీతాన్ని అందిస్తుండగా, నాని చమిడిశెట్టి ఛాయాగ్రహణం, జునైద్ సిద్ధిఖీ ఎడిటింగ్ మరియు రాజీవ్ నాయర్ ప్రొడక్షన్ డిజైనింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.




## కందుల సులోచనగా అనుపమ

టాలీవుడ్ నటుడు శర్వానంద్ కథానాయకుడిగా దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి' . ప్రస్తుతం ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుడగా తాజాగా ఈ సినిమా నుంచి కథానాయిక అనుపమ పరమేశ్వరన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సినిమాలో అనుపమ కందుల సులోచనా రాణి అనే గ్రామీణ యువతిగా కనిపించబోతుంది. చేతిలో క్యారేజీ, మోదుగ ఆకులు పట్టుకుని ఉన్న పోస్టర్ ప్రస్తుతం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. 1960ల నాటి తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు నేపథ్యంలో ఈ సినిమా సాగబోతున్నట్లు సమాచారం. సంపత్ నంది దర్శకత్వంలో వస్తున్న ఈ హై-వోల్టేజ్ డ్రామాలో శర్వానంద్ ఊరమాస్ అవతారంలో కనిపిస్తుండగా, అనుపమ పరమేశ్వరన్ మరియు డింపుల్ హయాతీ ఫీమేల్ లీడ్స్ గా నటిస్తున్నారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రాన్ని ఆగస్టు 28, 2026 న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.




## దృశ్యం-3 టీజర్ విడుదల

మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ 'దృశ్యం 3' టీజర్ ఎట్టకేలకు విడుదలైంది. బుధవారం సాయంత్రం విడుదలైన ఈ టీజర్ సోషల్ మీడియాను ఊపేస్తోంది. ఈ వీడియోలో గత రెండు భాగాలకు సంబంధించిన కీలక ఘట్టాలను గుర్తు చేస్తూనే, మూడో భాగంపై భారీ అంచనాలను పెంచేశారు దర్శకుడు జీతూ జోసెఫ్. గతంలో తన కుటుంబాన్ని రక్షించుకోవడానికి అత్యంత ధైర్యంగా, ప్రశాంతంగా ఎత్తుగడలు వేసిన జార్జ్ కుట్టీ, ఈసారి మాత్రం తీవ్రమైన భయంలో కనిపిస్తుండటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. 'ఇప్పుడు నాకు భయంగా ఉంది సార్.. నన్ను ఇంకెవరో గమనిస్తున్నారని అనిపిస్తోంది' అంటూ మోహన్‌లాల్ చెప్పే డైలాగ్ ఈసారి కథలో ఏదో పెద్ద ప్రమాదం పొంచి ఉందని సూచిస్తోంది. ఈ టీజర్‌లో మీనా, అన్సిబా, ఎస్తేర్ అనిల్ తో పాటు ఆశా శరత్ వంటి పాత పాత్రలన్నీ కనిపించి సందడి చేశాయి. ఆశీర్వాద్ సినిమాస్ బ్యానర్‌పై ఆంటోనీ పెరుంబవూర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మోహన్‌లాల్ పుట్టినరోజైన మే 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. ఈ మూడవ భాగంతోనే సెన్సేషనల్ సిరీస్‌కు ముగింపు పలకనున్నట్లు తెలుస్తోంది. ఇక మలయాళ టీజర్ రావడంతో తెలుగులో విక్టరీ వెంకటేష్ నటించే రీమేక్ ఎప్పుడుంటుందా అని టాలీవుడ్ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతానికి తెలుగు రీమేక్‌పై ఎలాంటి అధికారిక ప్రకటన రానప్పటికీ, మలయాళ వెర్షన్ విడుదలైన తర్వాత అక్కడ వచ్చే స్పందనను బట్టి రీమేక్ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.



## ఓటీటీలోకి బైకర్ విడుదల

టాలీవుడ్ యంగ్ హీరో శర్వానంద్ నటించిన లేటెస్ట్ స్పోర్ట్స్ డ్రామా 'బైకర్' ఓటీటీలోకి రాబోతుంది. భారతదేశంలోనే మొట్టమొదటి మోటోక్రాస్ రేసింగ్ నేపథ్యంతో తెరకెక్కిన ఈ చిత్రం, థియేటర్లలో విడుదలైన నెల రోజుల్లోనే డిజిటల్ ప్రేక్షకులను పలకరించబోతోంది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు దక్కించుకుంది. దీంతో ఈ చిత్రం మే 1 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో కూడా ఇది అందుబాటులోకి రానుంది. ఇక హిందీలో ఈ సినిమాను 'శర్వా' అనే టైటిల్‌తో విడుదల చేస్తున్నారు. అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో శర్వానంద్ సరసన మాళవిక నాయర్ కథానాయికగా నటించగా, సీనియర్ నటుడు రాజశేఖర్ కీలక పాత్రలో కనిపించారు. ఒక ప్రొఫెషనల్ బైక్ రేసర్ తన కెరీర్‌లో ఎదుర్కొనే సవాళ్లు, తండ్రి ఆశయాల కోసం అతను చేసే పోరాటాన్ని ఈ సినిమాలో అద్భుతంగా చూపించారు. థియేటర్లలో మిశ్రమ స్పందన లభించినప్పటికీ, రేసింగ్ సీక్వెన్స్ మరియు టెక్నికల్ వాల్యూస్ పరంగా సినిమాకు మంచి ప్రశంసలు దక్కాయి.



## కల్కిలో నటించడం లేదు

రెబల్ స్టార్ ప్రభాస్, దర్శకుడు నాగ్ అశ్విన్‌ల కాంబినేషన్‌లో వచ్చిన 'కల్కి 2898 ఏడీ' బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, ప్రస్తుతం సెట్స్‌పై ఉన్న ఈ చిత్ర సీక్వెల్‌కు సంబంధించి గత కొద్దిరోజులుగా ఒక ఆసక్తికర వార్త నెట్టింట హల్చల్ చేస్తోంది. టాలీవుడ్ సీనియర్ నటుడు జేడీ చక్రవర్తి ఈ రెండో భాగంలో ఒక కీలక పాత్ర పోషిస్తున్నారని జోరుగా ప్రచారం సాగుతుంది. అయితే తాజాగా తన సినిమా 'గాయపడ్డ సింహం' ప్రమోషన్లలో పాల్గొన్న ఆయన ఈ రూమర్లపై స్పందిస్తూ క్లారిటీ ఇచ్చారు. 'కల్కి 2'లో తాను నటిస్తున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని, ఇప్పటివరకు తాను ఎలాంటి షూటింగ్‌లోనూ పాల్గొనలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రచారాన్ని కేవలం సరదాగా ఎంజాయ్ చేశానని చెబుతూ, ఆ వార్తలకు జేడీ స్వస్తి పలికారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సీక్వెల్‌లో ప్రభాస్ భైరవ, కర్ణ పాత్రలతో పాటు మరో విభిన్నమైన లుక్‌లో కనిపించనున్నారని తెలుస్తోంది. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ వంటి దిగ్గజాల పాత్రల నిడివి ఈసారి మరింత ఎక్కువగా ఉంటుందని సమాచారం.

PRINTED, PUBLISHED and OWNED BY **G.THIRUPATHI,** PRINTED AT **SRK PRINTERS,** (V) KOKKERAKUNTA, RAMADUGU MANDAL, KARIMNAGAR DIST. 505001, TELANGANA, PUBLISHED FROM H.NO.10-6-219, KISAN NAGAR, KARIMNAGAR 505001, TELANGANA, **RNI NO.TELTEL/2006/69862,** EDITOR: **BANDARI MARUTHI**